ప్రజాశక్తి

శుక్రవారం 22 సెప్టెంబర్ 2023 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా





పార్కులకు వెళితే

ఇక జేబులు ఖాళీ

- ప్రవేశానికి, కెమెరా, వీడియోలకు భారీగా ఫీజులు
- స్థాయీ సంఘం ఆమోదంతో అమలు

ప్రజాశక్తి - విజయవాడ : ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియం కాంప్లెక్స్‌లోని విబిఎం కళాశాల లీజు కాలాన్ని 2026 వరకు పొడిగిస్తూ విజయవాడ నగర పాలక సంస్థ స్థాయీ సంఘం తీర్మానించింది. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన గురువారం స్థాయీ సంఘ సమావేశం జరిగింది. స్టేడియం కాంప్లెక్స్‌లోని మొదటి, రెండవ, మూడవ అంతస్తుల్లోని 20,184 చదరపు అడుగుల విస్తీర్ణంలో కళాశాలను నిర్వహించుకునేందుకు కాలాన్ని పొడిగించాలని కళాశాల యాజమాన్యం విఎంసిని కోరిన నేపథ్యంలో... జిఎస్‌టితో కలిపి నెలకు రూ.6.19 లక్షల అద్దె చెల్లించేలా లీజు గడువును 2026 అక్టోబర్ 31 వరకు పొడిగిస్తూ తీర్మానించింది. వర్షాలకు కొండ చరియలు విరిగి పడకుండా ఐరన్ మెస్ ఏర్పాటుకు 44వ డివిజన్లో రూ.43.43 లక్షలు, 45వ డివిజన్లో రూ.43.43 లక్షలు విఎంసి సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయడానికి ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ భాగ్యలక్ష్మి

తెలిపింది. ఎంఎల్‌ఎ వెల్లంపల్లి శ్రీనివాసరావు సూచన మేరకు లలితనగర్ ప్రధాన రోడ్డును బిటి రోడ్డుగా అభివృద్ధి చేయడానికి రూ.50 లక్షలు, విఎంసి వెహికల్ డిపో నైట్ షెల్టర్‌ను నిర్వహిస్తున్న రూట్స్ హెల్త్ పౌండేషన్‌కు వచ్చే ఏడాది ఆగస్టు 31 వరకు ఒ అండ్ ఎం ఛార్జీల కింద నెలకు లక్ష రూపాయల చొప్పున చెల్లించేందుకు ఆమోదం తెలిపింది. 47వ డివిజన్లోని ఏనుగుల లక్ష్మణరావు వారి వీధికి సిసి రోడ్డుతోపాటు ఇరువైపుల పేవర్ బ్లాక్స్ వేయడానికి రూ.37.22 లక్షల అంచనా వ్యయానికి తీర్మానించింది. రాఘవయ్యపార్కు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పార్కుల సందర్శకుల నుండి విఎంసి నిర్ణయించిన రేట్ల ప్రకారం డబ్బులు వసూలు చేయాలని తీర్మానించింది. రాఘవయ్య పార్క్ ప్రవేశ రుసుం పెద్దలకు రూ.10, పిల్లలకు రూ.5, కెమెరా ద్వారా ఫొటోలు తీసుకుంటే రూ.20, వీడియో తీసుకుంటే రూ.100 వసూలు చేయాలని నిర్ణయించింది. అలాగే రాఘవయ్యపార్క్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పార్కు కలిపి సందర్శించడానికి పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.10, వెహికల్ పార్కింగ్‌లో కారుకు రూ.50, బైక్‌కు రూ.20, కెమెరాకు రూ.20, వీడియోకు రూ.100, టివి సీరియల్స్ షూటింగ్ (షార్ట్ ఫిలిమ్స్)కు రోజుకు రూ.5 వేలు, బర్త్‌డే, వివాహ వేడుకలకు రోజుకు రూ.1000, సినిమా షూటింగ్‌కు గంటకు రూ.10 వేలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ప్రవేశ రుసుం ఒక్కొక్కరికి రూ.10, వాకింగ్, యోగా కోసం వచ్చే వారికి సభ్యత్వ రుసుం నెలకు పెద్దలకు రూ.300, కారు పార్కింగ్‌కు రూ.1000, బైక్‌కు రూ.500 చొప్పున వసూలు చేసేవిధంగా స్థాయీ సంఘం రేట్లను నిర్ణయించింది. ఈ సమావేశంలో స్థాయీ సంఘం సభ్యులు తాటిపర్తి కొండారెడ్డి, గుడివాడ నరేంద్ర రాఘవ, మరుపిళ్ల రాజేష్, బంకా శకుంతలా దేవి, ఎం మాధురి, అదనపు కమిషనర్ (ప్రాజెక్టు) కెవి సత్యవతి, సిఎంఒహెచ్ డాక్టర్ పి రత్నావళి తదితరులు పాల్గొన్నారు.



రాఘవయ్యపార్క్

గురజాడ జయంతి సందర్భంగా

నగరంలో 2కె రన్



2కె రన్‌లో కలెక్టర్ డిల్లీరావు తదితరులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మహాకవి గురజాడ అప్పారావు 161వ జయంతిని పురస్కరించుకొని గురువారం నగరంలో 2కె రన్ నిర్వహించారు. జాషువా సాంస్కృతిక వేదిక, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ , జిఆర్‌కె పోలవరపు కళాసమితి, సేఫ్ సంస్థ, అల్లూరి సీతా రామరాజు సాంస్కృతిక కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన ఈ రన్‌ను ఇందిరాగాంధీ స్టేడియం వద్ద కలెక్టర్ ఢిల్లీరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గురజాడ స్ఫూర్తితో సమాజంలో నెలకొన్న రుగ్మతలను రూపుమాపాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మహాకవి గురజాడ చేపట్టిన కార్యక్రమాలు, రచనలు సాంఘిక పరివర్తనకు దోహదపడతాయన్నారు. సామాన్యుడికి సైతం అర్థమయ్యేలా తనదైన శైలితో వాడుక భాషలో మహాకావ్యం కన్యాశుల్కం, పుత్తడిబొమ్మ పూర్ణమ్మ లాంటివి ఎన్నో రచించారని గుర్తుచేశారు. సమాజాన్ని మోసం చేసే గిరీశం లాంటి పాత్రలతో, బాల్యవివాహాల దురాచారాలను ఎండగట్టారని పేర్కొన్నారు. నేటి సమాజంలో గిరీశం పాత్ర లాంటి వారి సంఖ్య పెరుగుతుండడం ఆందోళనకరమని అన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో గురజాడ రచనలపై చర్చా వేదికలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. సుమారు 1000 మంది విద్యార్థులతో 2కె రన్ ర్యాలీ నిర్వహించారు. "మతములన్నియు మాసిపోవును...జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును" అనే నినాదంలో ఏర్పాటు చేసిన బ్యానర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈకార్యక్రమంలో మాజీ మేయర్ జంధ్యాల శంకర్, ప్రముఖ విద్యావేత్త ఎస్.ఆర్.పరిమి, వాసవ్య మహిళామండలి అధ్యక్షురాలు జి.రష్మి, అమరావతి బాలోత్సవం గౌరవాధ్యక్షులు చలవాది మల్లిఖార్జునరావు, ఆక్వాడెవిల్స్ అధ్యక్షులు వెలగపూడి వెంకటేశ్వరరావు, అల్లూరి సాంస్కృతిక కేంద్రం కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరాజు, సేఫ్ కార్యదర్శి జి.జ్యోత్స్న, ఎంబివికె కార్యదర్శి పి.మురళీ కష్ణ, జి.ఆర్.కె పోలవరపు కళాసమితి అధ్యక్షులు గోళ్ల నారాయణరావు, పారిశ్రామికవేత్త బాయన అప్పారావు, జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణరావు, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ నాయకులు సునీల్, మాజీ ప్రొఫెసర్ ఎం.సి. దాస్, ప్రముఖ ఆర్టిస్ట్ స్ఫూర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక శాఖ స్థలంలో వైసిపి కార్యాలయ నిర్మాణంపై

వివాదం

- ఆర్‌టిసి ప్రహరీగోడ కూల్చివేత
- అడ్డుకున్న అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి - భవానీపురం : కార్మిక శాఖ స్థలంలో వైసిపి కార్యాలయ నిర్మాణంపై వివాదం నెలకొంది. విజయవాడ నగరం విద్యాధరపురంలోని చెరువు సెంటర్ సమీపంలోని ఆర్‌టిసి ట్రైనింగ్ సెంటర్లో గల కార్మిక శాఖ స్థలాన్ని గురువారం



పనులను అడ్డుకుంటున్న ఆర్‌టిసి సిబ్బంది



ఆర్‌టిసి ప్రహరీ గోడ కూల్చివేసిన దృశ్యం

పొక్లయినర్‌లో చదును చేసి వైసిపి ఎన్‌టిఆర్ జిల్లా కార్యాలయ నిర్మాణం నిమిత్తం షెడ్డు ఏర్పాటుకు ఉపక్రమించారు. అయితే దాని పక్కనే ఉన్న ఆర్‌టిసి ప్రహరీగోడను సంబంధిత అధికారులకు తెలియకుండా కూల్చివేశారు. అంతేగాక ఆర్‌టిసి స్థలంలో విద్యుత్ స్తంభాలు నిర్మించారు. విషయం తెలుసుకున్న ఆర్‌టిసి వర్క్‌షాపు మేనేజర్, సిబ్బంది అక్కడికి చేరుకుని విద్యుత్ శాఖ చేపట్టిన పనులపై నిలదీశారు. అలాగే ఆర్‌టిసి ప్రహరీ గోడ కూల్చివేయడంపై ఆరా తీశారు. సమాచారం అందుకున్న భవానీపురం పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. కార్మిక శాఖ స్థలంలో వైసిపి జిల్లా కార్యాలయ భవన (మిగతా 6లో)





అయ్యంకిలో దంపతుల హత్య

వార్త మెయిన్లో

'ప్రైవేటు'లోనే అధికంగా అడ్మిషన్లు

- ప్రభుత్వ కళాశాలల్లో నామమాత్రం
- ప్రభావం చూపని అమ్మఒడి, మనబడి నాడు నేడు

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థుల ప్రవేశాలు చెప్పుకోదగ్గ స్థాయిలో పెరగడం లేదు. గవర్నమెంట్ ఇనిస్టిట్యూషన్స్‌లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు మనబడి నాడు నేడు, అమ్మఒడి వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తున్నా వాటి ప్రభావం నామ మాత్రంగానే ఉంటోంది. తల్లిదండ్రులు వారి పిల్లలను సర్కార్ బడులు, కళాశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి కనబరచడం లేదు. ప్రత్యేకించి ఇంటర్మీడియట్ కళాశాలల్లో ఇది కొట్టొచ్చినట్లు కనబడుతోంది. క్వాలిఫైడ్ టీచింగ్ స్టాఫ్, బోధన రంగంలో అనుభవం కలిగిన లెక్చరర్లు ప్రభుత్వ కళాశాలల్లో ఉన్నప్పటికీ ఇక్కడ చేరేందుకు ముందుకు రావడం లేదు. ఎన్టీఆర్ జిల్లాలో 10 గవర్నమెంట్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఏకొండూరు, గంపలగూడెం, కంచికచర్ల, మైలవరం, తిరువూరు, వీరుల్లపాడు, విజయవాడ అర్బన్, విజయవాడ రూరల్, విస్సన్నపేట మండలాల్లో గతంలో వీటిని ఏర్పాటు చేశారు. ఇవి ఏళ్ల తరబడి చరిత్ర కలిగిన కాలేజీలు. అయినప్పటికీ వందల్లోనే విద్యార్థుల సంఖ్య ఉంటోంది. మరో వైపు ప్రైవేటు కళశాలల్లో వేల సంఖ్యలో విద్యార్థుల సంఖ్య ఉంటోంది. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా దాదాపు 168 ప్రైవేటు ఇంటర్మీడియట్ కళాశాలలు ఉన్నాయి. 2023-24 విద్యా సంవత్సరంలో ప్రైవేటు సంస్థల్లోనే అధికంగా ప్రవేశాలు పొందినట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి. వీటిని ఒక సారి పరిశీలిస్తే ఈ ఏడాది 2288 మంది విద్యార్థులు గవర్నమెంట్ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు పొందారు. వీరిలో 1263 మంది మొదటి ఏడాది ఇంటర్‌లోను, 1025 మంది ద్వితీయ సంవత్సరంలోను అడ్మిషన్లు పొందిన వారిలో ఉన్నారు. గత విద్యా సంవత్సరంలో మొత్తం 1820 మంది చేరగా వీరిలో 878 మంది ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లోను, 942



విద్యార్థుల వివరాలు

విద్యా సంవత్సరం	ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య	ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య
2023-24	2,288	77,762
2022-23	1,820	73,670

మంది సెకండ్ ఇయర్‌లోను ఉన్నారు. గవర్నమెంట్ కాలేజీల్లో పోయిన ఏడాది కంటే ఈ సంవత్సరం ప్రవేశాల్లో సంఖ్య కాస్తా మెరుగు పడింది. దాదాపు 468 మంది పెరిగారు. మరో వైపు ప్రైవేటు విద్యా సంస్థల్లో ఈ సంఖ్య భారీగా పెరిగింది. 2023-24 విద్యా సంవత్సరంలో 77,762 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. వీరిలో 40355 మంది ఇంటర్ ఫస్ట్ ఇయర్, 37407 మంది సెకండ్ ఇయర్ విద్యార్థులు ఉన్నారు. అలాగే 2022-23లో 73670 మంది చేరగా వీరిలో 38350 మంది మొదటి సంవత్సరం, 35320 మంది ద్వితీయ సంవత్సరం వారు ఉన్నారు. అంటే ప్రభుత్వ కశాలల్లో కంటే ప్రైవేటు కాలేజీల్లో ఈ ఏడాది 75,474 మంది, పోయిన సంవత్సరం 71,850 మంది అధికంగా అడ్మిషన్లు పొందడం (మిగతా 6లో)



జెండా ఆవిష్కరిస్తున్న లింగారావు

బుజ్జి బాబయ్య ఆశయ సాధనకు కృషి

వర్థంతి సభలో సిపిఎం నేతలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేటరూరల్: మోరే బుజ్జి బాబయ్య ఆశయ సాధన కోసం కార్యకర్తలు పని చేయాలని సిపిఎం నాయకులు కాకనబోయిన లింగారావు, కోటా కృష్ణ అన్నారు. మండలంలోని షేర్ మహమ్మద్‌పేట గ్రామంలో బుధవారం రాత్రి సిపిఎం నాయకులు మోరే బుజ్జి బాబయ్య 47వ వర్థంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మోరే బుజ్జి బాబయ్య, బక్కమ్మ, గొట్టేముక్కల సైదారెడ్డి స్తూపాలకు నాయకులు పుట్టం పుల్లారావు, కాకనబోయిన సుబ్బారావు, కాకనబోయిన లింగారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు అమరవీరుల స్థూపాల వద్ద సిపిఎం జెండాను సీనియర్ నాయకులు కాకనబోయిన లింగారావు ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ గ్రామంలో సిపిఎం స్థాపన కోసం అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్న నాయకుడు మోరే బుజ్జి బాబయ్య అన్నారు. పార్టీనే తన కులం, తన మతమని సిపిఎం సిద్ధాంతాలకు కట్టుబడి పని చేశారని, ప్రజల హదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల, పట్టణ కార్యదర్శి సోమోజు నాగమణి, నాయకులు కోటా రవికుమార్, షేక్ గౌస్‌మియా, జె వెంకటరావు, షేక్ బడేమియా, లింగయ్య, దంతాల వెంకటేశ్వర్లు, ఎస్ రామనాథం తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీలోని క్రాంతి హై స్కూల్లో లయన్స్ క్లబ్ ఆఫ్ విఆర్‌కె నగర్ మహిళ ఆధ్వర్యంలో చైల్డ్



కేన్సర్‌పై అవగాహనా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భ:గా డాక్టర్ గంగా విజయవాణి కేన్సర్‌లో రకాలు, జాగ్రత్తలపై వివరించారు. డిసి ఫర్ చైల్డ్ కేన్సర్ ప్రోగ్రాం యుగంధర్ అవగాహనా పుస్తకాలను, కరపత్రాలు పిల్లలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ దేవినేని జోనీకుమారి, గట్టి లక్ష్మి, శోభారాణి, అమ్మాజీ పాల్గొన్నారు.



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న కౌలు, రైతు సంఘాల నాయకులు

తెగుళ్లతో మిర్చి రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-గంపలగూడెం: మండలంలోని పలు గ్రామాల్లో మిర్చి తోటలకు అంతుచిక్కని తెగుళ్లతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పూత దశలో ఉన్న మిరప తోటలను దున్నేస్తున్నారు. దీంతో మండల కౌలు రైతు, రైతు సంఘాల నాయకులు గువ్వల సీతారామిరెడ్డి, మద్దిరెడ్డి వెంకటరెడ్డి, జానపాటి వెంకటేశ్వరరావు మిర్చి పంటలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలో ఈ ఏడాది గతం కంటే అత్యధికంగా మిర్చి సాగు చేశారని తెలిపారు. ఒక ఎకరాకు లక్ష రూపాయల వరకు పెట్టుబడి పెట్టినట్లు వివరించారు. మండలంలోని కనుమూరు, అనుములంక గ్రామాల్లో వంద ఎకరాలకు పైగా మిరప తోటలను దున్ని ప్రత్యామ్నాయ పంటలకు రైతులు సిద్ధమైనట్లు తెలిపారు. అధికారులు ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు స్థానిక తహసిల్దార్ జి.బాలకృష్ణారెడ్డి, ఏవో సాయి శ్రీలకు వినతిపత్రాలు అందజేశారు.

అసైన్డ్ భూములపై హక్కులు కల్పించాలి

కెవిపిఎస్, వ్యకాస జిల్లా కార్యదర్శులు నటరాజు, కల్యాణ్ డిమాండ్

ప్రజాశక్తి-మైలవరం: అర్హులకు అసైన్ భూములపై హక్కులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కల్యాణ్ డిమాండ్ చేశారు. దళిత రక్షణ యాత్రలో భాగంగా మండలంలోని ముసుమల్లి, పుల్లూరు, దాసులపాలెం, సబ్జపాడు, మైలవరంలోని ఎస్సీ కాలనీలో గురువారం బైక్ యాత్ర నిర్వహించి ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసైన్డ్ భూముల చట్ట సవరణ కోసం తీసుకువచ్చిన ఆర్డినెన్స్ వెంటనే రద్దు చేయాలని, కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్యాక్రాంతమైన భూములను తిరిగి అర్హులైన పేదలకు హక్కులు కల్పించాలన్నారు. కార్పొరేట్లు, భూస్వాములు, పెత్తందారులకే లబ్ధి చేకూర్చటానికి అసైన్డ్ చట్టాన్ని సవరణ చేస్తున్నారని విమర్శించారు. చట్ట సవరణ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా జరిగే పోరాటాలలో పేదలంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు లంక వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి పి ఆనందరావు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లవరపు కుటుంబరావు, సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్ సుధాకర్, మండల కార్యదర్శి పి నాగేశ్వరరావు, మంద స్వామి, ముత్యాలరావు, నాగమణి, యోహాను, అబ్రహం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు: దళితుల ఆత్మ గౌరవం, కూలీ, ఉపాధి, సంక్షేమం, డప్పు కళాకారుల భద్రతకై జరుగుతున్న దళిత రక్షణ యాత్ర గురువారం పెనుగంచిప్రోలుకు చేరుకుంది. ఈ సందర్భంగా దళిత రక్షణ యాత్ర కన్వీనర్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జి.నటరాజు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 200 పని దినాలు కల్పించాలని, రూ.600 రోజువారి వేతనం ఇవ్వాలని, డప్పు కళాకారులకు, చర్మ వృత్తిదారులకు రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో శ్మశాన స్థలాలు అన్యాక్రాంతానికి గురవుతున్నాయని ప్రజలు నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. నవాబ్‌పేట పాఠశాల లేకపోవడంతో ఐదు కిలో మీటర్లు దూరంలో ఉన్న అనాసాగరంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌కు పంపించ లేక పిల్లల చదువులు నిలిచిపోతున్నట్లు తెలిపారు. యాత్ర ముగింపు సందర్భంగా ఈ నెల 29న విజయవాడలో జరిగే మహాధర్నాకు తరలిరావాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి దారా నాగేశ్వరరావు, కెవిపిఎస్ మండల కార్యదర్శి కాకాని వెంకయ్య, సహాయ కార్యదర్శి వినయ్ కుమార్, తోటచర్ల ప్రసాద్, నక్క ఆశీర్వాదం, కుక్కమూడి రాజు, తుమ్మల వెంకట్ రమణ పాల్గొన్నారు.



మైలవరంలో...



పెనుగంచిప్రోలులో...

మంచినీటి సమస్యను పరిష్కరించండి

సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ



మాట్లాడుతున్న సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ

ప్రజాశక్తి-నందిగామ: కృష్ణానదికి కూతవేటు దూరంలో ఉన్న నందిగామ పట్టణంలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, తక్షణమే మంచినీటి సమస్య పరిష్కరించాలని సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం నందిగామ పట్టణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందిగామ పట్టణంలో తాగునీటి సమస్యను పరిష్కరించడంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పూర్తిగా విఫలమైనారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నవ నందిగామ నిర్మాణం చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న స్థానిక నాయకులు ప్రజలకు రోజూ మంచినీరు ఇవ్వడంలో పూర్తిగా వైఫల్యం చెందారని మండిపడ్డారు. వారానికి ఒక్కసారి కూడా మంచినీరు ఇవ్వడం చేతకాని నాయకులు, అధికారులు నవనందిగామ నిర్మాణం ఎలా చేస్తారని ప్రశ్నించారు. నందిగామ పట్టణంలో రూ.89 కోట్ల వ్యయంతో శాశ్వత మంచినీటి పథకం అమలు చేస్తామని రెండుసార్లు శంకుస్థాపన చేశారని, ఇంతవరకు పనులు ప్రారంభించలేదని తెలిపారు. రూ.15 కోట్ల వ్యయంతో నిర్మించిన డ్రైనేజీలు మురుగు నీరు పారుదల లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల ఎన్టీఆర్ జిల్లా పరిధిలో పలుచోట్ల నారుమళ్లు ఎండిపోతున్నాయని, కొన్నిచోట్ల ఇప్పటివరకు వరి నాట్లు కూడా వేయలేదని తెలిపారు. సాగర్ కాలువలకు నీరు లేక ఒట్టిపోతున్నాయని, ఎత్తిపోతల పథకాలు నిర్వహణ సక్రమంగా లేక మోటార్లు పనిచేయడం లేదని తెలిపారు. ఎత్తిపోతల పథకాల నిర్వహణ బాధ్యత ప్రభుత్వమే తీసుకొని పంటలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం నందిగామ పట్టణ కార్యదర్శి కటారపు గోపాల్, నాయకులు సయ్యద్ ఖాసిం, వెంకటేశ్వరరావు, గోపినాయక్, రవిశేఖర్, శ్రీనివాస్, నారాయణ పాల్గొన్నారు.



రోడ్లు అధ్వానం

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: మండల కేంద్రంలోని ఎస్సీ ఏరియాలో కొన్ని ప్రాంతాల్లో చినుకు పడితే రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో పాటు రోడ్లు గుంతలుగా మారడంతో వర్షం పడితే చాలు రోడ్డుపై ఉన్న గోతుల్లో నీరు ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సిమెంట్ రోడ్లు వేయాలని అధికారులు ఎన్నోసార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ముగిసిన ఆటల పోటీలు

ప్రజాశక్తి-గంపలగూడెం: స్థానిక జడ్పీహెచ్‌ఎస్ స్కూల్లో జరిగిన ఆటల పోటీలు ముగిశాయి. తిరువూరు, ఏ కొండూరు, విస్సన్నపేట, గంపలగూడెం మండలాల నుండి క్రీడాకారులు పాల్గొన్నారు. తొమ్మిది రకాల ఆటల పోటీలు మూడు రోజులు పాటు జరిగాయి. పాఠశాల ఇంచార్జ్ బి.కిరణ్‌కుమార్, గుర్రం గోపాలరావు, హెచ్.అంజయ్య, బి. రాంబాబు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గొయ్యి

ప్రజాశక్తి-మైలవరం: మైలవరం భద్రాచలం రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆర్అండ్‌బి రహదారిపై ఏర్పడ్డ గొయ్యి ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు, సైక్లిస్టులు మోకాళ్ల లోతు ఉన్న గొయ్యి కనిపించక కింద పడ్డ సంఘటనలూ ఉన్నాయి. చిన్నపాటి వర్షానికి ఈ గోతిలో నీళ్ల ఏర్పడటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



25న మహాధర్నాను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఈ నెల 25 న విజయవాడ అలంకార్ సెంటర్‌లో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామన్న సిఎం హామీని అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కార్మికులకు వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్, వెల్డింగ్, ఆఫీసు సిబ్బందికి హెల్త్ అలవెన్సు రూ.6 వేలు అమలు చేయాలని కోరారు. సిఐటియు మండల కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ కొండపల్లి మున్సిపల్ వర్కర్స్‌కు బుధవారం ఒక్కపూట సెలవు మంజూరు చేయాలన్నారు. చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పవన్, శ్రీను, దేవుళ్ళు, సురేష్ లక్ష్మయ్య, కృష్ణ, సింహాచలం, రమణ తదితరులు పాల్గొన్నారు. **తిరువూరు:** తిరువూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి సత్యవతికి అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా నోటీసును అందజేశారు. ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు, మినీ కార్యకర్తలు ధర్నాకు వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి కె.నాగ మణి, అధ్యక్షురాలు పి.పద్మ, వెంకటేశ్వరమ్మ, సుశీల తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నంలో మాట్లాడుతున్న ఎన్‌సిహెచ్ శ్రీనివాస్



తిరువూరులో నోటీసు అందజేస్తున్న అంగన్‌వాడీలు

పెదపట్నంలో పశు వైద్య శిబిరం

ప్రజాశకి- మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం మండలం పెదపట్నం గ్రామ పంచాయతీలో గురువారం వైయస్సార్ పశు వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల పశు వైద్యవైద్యులు డాక్టర్ దీపక్ డానియల్ మాట్లాడుతూ వర్షపు తొలకరి సీజన్లో పశువులకు వ్యాధులు ఎక్కువగా వస్తాయన్నారు. ముందస్తు చర్యగా ప్రభుత్వము గ్రామాల్లో వైయస్సార్ పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయటం ద్వారా పశువులకు వివిధ రకాల జబ్బులకు మందులు వ్యాక్సిన్లు అందిస్తున్నామన్నారు. పశువులకు ఏదైనా ఆరోగ్య సమస్య ఉన్నప్పుడు పశు సంచార వాహనాలు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1962కి సమాచారం అందిస్తే సంచార వాహనంలో డాక్టర్లు వచ్చి సరైన వైద్యం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రైతులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న దృశ్యం

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ని ఎన్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరము నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి ఆధ్వర్యంలో మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన టెక్నీషియన్స్ డాక్టర్స్ కార్యక్రమంలో పాల్గొని రక్త సేకరణ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విభాగపు అధిపతులు ఏ వీర కుమారి, డాక్టర్ రవిబాబు, వైస్ ప్రిన్సిపాల్ ఆర్ అంకారావు ఐక్య కోఆర్డినేటర్ డాక్టర్ బి సంధ్యశ్రీ కార్యక్రమంలో పాల్గొనగా అధ్యాపక అధ్యాపక సిబ్బంది విద్యార్థులు రక్తదానం చేసిన వారిని అభినందించారు.



కబడ్డీ బాలికల జట్లు ఎంపిక

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం బాలుర ఉన్నత పాఠశాలలో అండర్ 14,17 బాలికల కబడ్డీ జట్టు ఎంపిక పూర్తయినట్లు కోచ్ నాగరాజు తెలిపారు. గురువారం జరిగిన పోటీల్లో నియోజకవర్గంలోని వివిధ పాఠశాలలకు చెందిన బాలికల క్రీడాకారులు పాల్గొన్నట్లు చెప్పారు. కబడ్డీ ఆటలో ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశామన్నారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు నిమ్మగడ్డ రవీంద్ర భవాని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా మూడో దశ రీసర్వే : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలోని 136 గ్రామాల్లో మూడవ దశ రీసర్వే పనులు చురుగ్గా జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు ఉన్నతాధికారులకు తెలిపారు. గురువారం రాష్ట్ర భూ పరిపాలన ముఖ్య కమిషనర్ జి సాయి ప్రసాద్, అదనపు కమిషనర్ ఏఎండి ఇంతియాజ్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి భూముల రీ సర్వే, భూ హక్కు పత్రాల పంపిణీ పై జిల్లాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్ నుండి మాట్లాడుతూ జిల్లాలో మూడవ దశ రీసర్వే కార్యక్రమం 136 గ్రామాల్లో ముమ్మరంగా జరుగుతోందన్నారు. అందులో చివరి ఆర్ ఓ ఆర్ ఐదు గ్రామాల్లో పూర్తయిందని, 13 నోటిఫికేషన్ 7 గ్రామాలకు జారీ చేశామని, 31 గ్రామాల్లోని 42,739 ఎకరాల్లో భూమి లెక్క కట్టామని, 73 గ్రామాల్లోని 11,333 ఎకరాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తి చేసామన్నారు. అలాగే రెండవ దశలో రీ సర్వే చేపట్టిన 53 గ్రామాలకు గాను అన్ని చోట్ల రీ సర్వే పూర్తి అయిందని, అందులో 51 గ్రామాల్లో సరిహద్దు రాళ్ల నాటామని చెప్పారు జిల్లాకు 45,799 సరిహద్దులు రాళ్ల రాగా అందులో 42,942 రాళ్ళను ఇప్పటికే నాటామని ఇక రెండు గ్రామాల్లో 2,857 రాళ్ల నాటాల్సి ఉందన్నారు. వాటిని కూడా త్వరగా నాటుతామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డిఆర్ఓ పి. వెంకటరమణ, భూ సర్వే రికార్డుల ఏడి రంగారావు, కలెక్టరేట్ కోఆర్డినేషన్ తహసిల్దార్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో రోడ్లు నిర్మించాలని డిమాండ్

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ పట్టణంలో జగనన్న కాలనీలో వెంటనే రహదారులు నిర్మించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన గుడివాడ మండలంలోని మల్లాయపాలెంలో జగనన్న కాలనీని పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆర్‌సిపి రెడ్డి మాట్లాడుతూ జగనన్న కాలనీలో రహదారుల దుస్థితి ప్రశ్నార్థకంగానే మిగిలిపోయింది అన్నారు. ఆర్భాటంగా ప్రభుత్వం ప్రకటించినట్టు రోడ్లు, మంచినీళ్లు, డ్రైనేజీ ,కరెంటు, తదితర సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. కానీ లబ్ధిదారులు ఇల్లు నిర్మించకపోతే రద్దు చేస్తామని ప్రభుత్వం చెప్తుందని, ప్రభుత్వం ఇచ్చే 1,80,000 రూపాయలతోఇల్లు నిర్మించడం సాధ్యమా అని ప్రశ్నించారు. జగనన్న కాలనీలో రోడ్లన్నీ తక్షణమే వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ టౌన్ కమిటీ సభ్యులు రేపాని కొండ తదితరులు పాల్గొన్నారు.



అధ్వానంగా ఉన్న రహదారులను పరిశీలిస్తున్న నాయకులు

పౌష్టికాహారంపై అవగాహన



పోషకారహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

ప్రజాశక్తి-ఘంటసాల : గర్భవతులు, బాలింతలు, చిన్నారులకు అంగన్వాడీల ద్వారా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్ వైజర్ డి.మేరీ తెలిపారు. ఘంటసాల మండలం, తూర్పు లంకపల్లి 1 అంగన్వాడీ కేంద్రంలో పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ మేరీ మాట్లాడుతూ అంగన్వాడీల ద్వారా బాలింతలు, గర్భిణీలు, 3 నుంచి 6 సంవత్సరాల పిల్లల తల్లులకు అందిస్తున్న పౌష్టికాహారం, ఇతర సేవలను గూర్చి తెలియజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ అంగన్వాడీల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని మేరీ కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త కె.ఇందిరా, గర్భిణీలు, బాలింతలు, పిల్లతల్లులు పాల్గొన్నారు.

విశ్వభారతిలో ఎఎన్ఆర్ శతజయంతి వేడుకలు

ప్రజాశక్తి-గుడివాడ : దాదా సాహెబ్‌ఫాల్కే అవార్డు గ్రహీత పద్మవిభూషణ్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలను గురువారం స్థానిక విశ్వభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ అవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వభారతి స్కూల్ చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ విశ్వభారతి స్కూల్ అభివృద్ధికి ఎఎన్ఆర్ ఇచ్చిన సలహాలు సూచనలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆర్ మంజుల, పాఠశాల సిబ్బంది, అద్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - భవానీపురం : రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి అక్కడి కక్కడే రక్తపు మడుగులో పడి మృతిచెందిన సంఘటనపై భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గురువారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో విజయవాడ వెళ్ళే ఎన్‌హెచ్ 65 రహదారిపై దత్త కళ్యాణ మండపం ఎదురుగా పైపుల కంపెనీ దగ్గర ఓ గుర్తు తెలియని వ్యక్తి (40)ను ఇబ్రహీంపట్నం నుండి విజయవాడ వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో సంబంధిత వ్యక్తి అక్కడి కక్కడే మృతిచెందాడు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామ సచివాలయం నందు గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శిగా పనిచేస్తున్న మోకా శివపార్వతికి వచ్చిన సమాచారం మేరకు భవానీపురం పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

కప్పలదొడ్డి కేసు కొట్టివేత

మచిలీపట్నం : మహిళ పట్ల అనుచితంగా, అవమానకరంగా ప్రవర్తించినట్లు నమోదు అయిన కప్పలదొడ్డి క్రిమినల్ కేసును కొట్టివేస్తూకృష్ణాజిల్లా ఫోక్సో కోర్టు న్యాయమూర్తి గురువారం తీర్పు చెప్పారు. 2022 మార్చి నెలలో కప్పలదొడ్డి గ్రామానికి చెందిన మహిళ పట్ల అనుచితంగా ప్రవర్తించి వేధింపులకు గురిచేశాడనే అభియోగంపై అదే గ్రామానికి చెందిన భూసి నాగార్జునపై మచిలీపట్నం మహిళా పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు. ఈ కేసును అప్పటి ఎస్సై ఎన్. సుబ్బారావు దర్యాప్తు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో పదిమంది సాక్ష్యులుని విచారణ చేశారు. నిందితుడిపై నేరారోపణకు తగిన సాక్షాధారాలు లేకపోవడంతో కేసు కొట్టి వేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. నిందితుడు తరపున లంకిశెట్టి బాలాజీ, కమ్మిలి విజయకుమార్ న్యాయవాదులుగా వ్యవహరించారు.

కొండలరావు మృతికి సంతాపం



కొండలరావు (ఫైల్)

పామర్రు: సిపిఎం అభిమాని బరిగెల కొండలరావు (60) హఠాన్మరణం చెందారు. ఈయన పామర్రు సిపిఎం నాయకులు బరిగెల కోటేశ్వరరావు (లేటు) రెండవ కుమారుడు. అలాగే పామరు పట్టణ సిపిఎం మాజీ కార్యదర్శి బరిగెల భీమేశ్వరరావు సోదరుడు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కొండలరావు సిపిఎం నిర్వహించిన కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొనేవారు. మృతదేహాన్ని ప్రముఖ వైద్యులు సురేష్ చంద్రారెడ్డి, సిపిఎం జిల్లా పార్టీ కార్యదర్శి వై నరసింహ రావు, పామర్రు మండల ఎంపీపీ దాసరి అశోక్ కుమార్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, దునుకు రఘునందన్ రావు, పామర్రు సిపిఎం నాయకులు ఓ గంగాధర్, ముళ్ళపూడి విల్సన్, కే నాగభూషణం, ఐ.రాజు, చాట్ల రాంబాబు తదితరులు మతదేహాన్ని సందర్శించి సంతాపం తెలియజేశారు.

గుడివాడ రూరల్ సిఐగా ఏసుబాబు



ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ రూరల్ సిఐగా కొండా ఏసుబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గుడివాడ రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఏసుబాబు గతంలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ శాఖ నుండి బదిలీపై గుడివాడ రూరల్ సిఐగా వచ్చారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి-గుడివాడ : అనాథ మృతదేహానికి అంత్యక్రియలు చేసి మానవత్వాన్ని చాటిన జనసేన నాయకుడు డాక్టర్ మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) అభినందనీయుడని పలువురు కోనియాడారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అనారోగ్యంతో గుంట కోడూరు గ్రామానికి చెందిన నవగట్ల పాపారావు చనిపోవడంతో ఆర్‌కె స్పందించి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిరణ్, శివ, చరణ్, జన సైనికులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు రహదారి కోసం ఆందోళన



ఆందోళన చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అవనిగడ్డ : దశాబ్దాలు గడుస్తున్నా ప్రభుత్వాలు మారిన వసుమట్ల శ్మశానానికి రహదారి ఏర్పాటు చేయకపోవడం దురదష్టకరమని జనసేన మండల పార్టీ అధ్యక్షులు శేషుబాబు విచారం వ్యక్తం చేశారు. గురువారం వసుమట్ల కాలనీ నుండి పాదయాత్ర చేసుకుంటూ అవనిగడ్డకు చేరుకొని ఆందోళన నిర్వహించి ఎంపీడీవో, తాసిల్దార్, పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలు అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన గతంలో ట్రాక్టర్లు నడిచిన రహదారి నేడు ఆక్రమణలకు గరైతే ఇప్పటివరకు ప్రభుత్వ అధికారులు కానీ అవనిగడ్డ గ్రామపంచాయతీ పాలకులు గానీ పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. కృష్ణానది తీరాన గల ఈ గ్రామ శ్మశానం పిచ్చి చెట్లతో ముళ్ళ పొదలతో నిండిపోయి ఉపయోగించడానికి వీలులేకుండా ఉంటే పాలకులు కన్నెత్తి చూడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. గ్రామసభలలో గతంలో అనేక పర్యాయాలు ఫిర్యాదు చేసిన అధికారులు పాలకులు పట్టించుకోలేదని ఆరోపించారు. ఒక వారం రోజుల్లోపు అధికారులు స్పందించి శ్మశానానికి రహదారి ఏర్పాటు చేయకపోతే గ్రామస్తులతో కలసి పంచాయతీ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఐటి కోఆర్డినేటర్ సుధాని నందగోపాల్, మండలి నాగరాజు, మండలి రాంగోపాల్, ఎంపిటిసి సభ్యులు బొప్పన భాను, వార్డు సభ్యులు మునిపల్లి శ్రీలక్ష్మి, చేబ్రోలు ప్రతాప్, అడప ప్రభాకర్ పాల్గొన్నారు

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం, విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలజికల్ మ్యూజియం బెంగళూరు జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న నేషనల్ సైన్స్ సెమినార్ 2023కు సంబంధించి గురువారం మండల స్థాయిలో ఇబ్రహీంపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీలు నిర్వహించారు. దీనిలో కొండపల్లి బాలిక ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని వై.రిషిక మండల స్థాయిలో ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.పద్మలత, గైడ్ టీచర్ రమాదేవి విద్యార్థిని అభినందించారు. ఈ నెల 23న ఆంధ్రా లయోలా కాలేజ్ విజయవాడలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో రిషిక పాల్గొనున్నట్లు తెలిపారు. **జగ్గయ్యపేట:** చిల్లకల్లు మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయిలో సెమినార్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో తపోవన్ విద్యాలయం విద్యార్థి వి.జాత్విక ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయికి ఎంపికైంది. **పెనుగంచిప్రోలు:** శివాపురం యుపి పాఠశాలకు చెందిన విద్యార్థిని భూక్యా లక్ష్మీప్రసన్న ప్రథమస్థానం సాధించి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఒడల విద్యాశాఖ అధికారి డి.రవీందర్‌నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ముక్కా సత్యనారాయణ, ఇన్చార్జి హెచ్‌ఎం సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై సమీక్ష

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో రెవిన్యూ డివిజనల్ అధికారి ఏ రవీంద్రరావు అధ్యక్షతన నందిగామ నియోజకవర్గంలోని పొలిటికల్ పార్టీల వారితో సమీక్షా సమావేశం నిర్వహించారు. నందిగామ నియోజకవర్గంలోని పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణకు గురించి రాజకీయ పార్టీలతో సమావేశం చేపట్టారు. ఈ సమావేశంలో నందిగామ తహసీల్దార్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

23 మంది విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-తిరువూరు: ఈ నెల 20వ తేదీన గంపలగూడెంలో తిరువూరు నియోజకవర్గస్థాయిలో జరిగిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆటల పోటీల్లో తిరువూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన 23 మంది విద్యార్థినులు జిల్లాస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రాజు తెలిపారు. కబడ్డీ, కోకో, త్రోబాల్, యోగ, బ్యాడ్మింటన్ అండ్ టెన్నికాయిట్ ఆటలలో విజయకేతనం ఎగురవేశారన్నారు.



కిసాన్ సభ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-తిరువూరు: కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సిఎస్ఐఆర్) రూపొందించబడిన కిసాన్ సభ కార్డులను తిరువూరు మండలంలో రైతులకు రైతు భరోసా కేంద్రాల ఉద్యోగులు గురువారం పంపిణీ చేశారు. సప్లై చైన్ పోర్టల్, భారత ప్రభుత్వంలోని సైన్స్ అండ్ టెక్నా లజీ మంత్రిత్వ శాఖచే మద్దతు ఇవ్వబడిన పోర్టల్ కిసాన్ సభ అనేది భారతదేశంలోని రైతులకు ఒక సమగ్ర వేదికగా, ఒక-స్టాప్ పరిష్కారంగా పనిచేసే సంస్థ అని ఉద్యోగులు తెలిపారు. రైతులకు సరసమైన ధర లకు వివిధ వ్యవసాయ వనరులను, సమాచారాన్ని సులభంగా యాక్సెస్ చేయడం దీని లక్ష్యమన్నారు. రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, యంత్రాలు, పరికరాలు, వ్యవసాయానికి అవసరమైన ఇన్‌పుట్‌ల గురించి వివరణాత్మక సమాచారాన్ని పొందవచ్చన్నారు.

టిడిపి హయాంలోనే ఉర్దూ అకాడమీని భ్రష్టు పట్టించారు

ప్రజాశక్తి-భవానీపురం : టిడిపి హయాంలోనే ఉర్దూ అకాడమీని భ్రష్ట పట్టించారని, అలాంటి దాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక చైర్మన్‌ను నియమించి సక్రమమార్గంలో నడిపిస్తున్నారని డైరెక్టర్లు తెలిపారు. ఉర్దూ కార్యాలయంలో గురువారం డైరెక్టర్లు అబ్దుల్ ఖలీమ్, హాజీ అబ్దుల్ షకూర్, సయ్యద్ నూరుల్లా ఖాదరి, షేక్ దిల్‌షా నజరానా, ఎస్‌కెఎం బాజీవలీ విలేకరులతో మాట్లాడుతూ కొంతమంది ఉర్దూ అకాడమీపై లేనిపోని ఆరోపణలు చేయటానికి ఉద్యోగులను రెచ్చగొట్టి నిరసన దీక్ష చేయించారని తెలిపారు. చైర్మన్ నదీమ్ అహ్మద్ ఉద్యోగులపై బెదిరింపులకు పాల్పడుతున్నారని అనేక ఆరోపణలు చేశారని, ఇవి సరికాదన్నారు. జగన్ నియమించిన చైర్మన్ నదీమ్ అహ్మద్ ఉర్దూ అకాడమీ అభివృద్ధికి ఎంతో చేశారని తెలిపారు.



గొప్ప సంఘ సంస్కర్త గురజాడ

జయంతి సభల్లో ప్రముఖులు

ప్రజాశక్తి-వన్‌టౌన్: బాల్యవివాహాలు, కన్యాశుల్కం వంటి సాంఘీక దురాచారాలను ఎదురించిన గొప్ప సంఘ సంస్కర్త గురజాడ వెంకట అప్పారావు అని రాకేష్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఎన్.వి.రావు కొనియాడారు. పశ్చిమ నియోజకవర్గంలోని కెఎల్ రావు నగర్‌లో గల రాకేష్ పబ్లిక్ స్కూలు డైరెక్టర్ ఎన్.వి.రావు ఆధ్వర్యంలో గురువారం గురజాడ వెంకట అప్పారావు 161వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుతగా గురజాడ వెంకట అప్పారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండల రాష్ట్ర అధ్యక్షులు చంద్రనాయక్, షేక్ నజీర్, ఆర్.పిచ్చయ్య, సూరిబాయి తదితరులు పాల్గొన్నారు. **విజయవాడ అర్బన్:** లబ్బీపేటలోని శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్దార్థ మహిళా జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. పద్మజ తొలుత గురజాడ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గురజాడ సుప్రసిద్ధ కన్యాశుల్కం వంటి నాటకాన్ని రచించి సమాజ మార్పుకు దోహదపడ్డారని అన్నారు. **అజిత్‌సింగ్‌నగర్:** ప్రకాష్ నగర్‌లోని మోటూరి హనుమంతరావు శ్రామిక భవన్‌లో ఐద్వా సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా సెంట్రల్ కార్యదర్శి జి.ఝాన్సీ, విజయలక్ష్మి, పావని, రజని, విజయ, మున్ని, కళ్యాణి పాల్గొన్నారు. ఐక్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఎస్‌టివిఆర్ గవర్నమెంట్ స్కూల్లో సెమినార్ జరిగింది. స్కూల్ ఉపాధ్యాయులు పాలకొల్లు, ఐద్వా ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శ్యామ్, ఆశ, ఝాన్సీ, లక్ష్మి పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం:** కొండపల్లి పట్టణ జన విజ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో స్థానిక నాగార్జున ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో జెవివి కొండపల్లి శాఖ అధ్యక్షులు ఎస్ నాగరాజు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. జెవివి అధ్యక్షులు జిల్లా వెనిగళ్ల మురళీమోహన్, ఉపాధ్యక్షులు పెట్ల కామేశ్వరరావు ప్రసంగించారు. ముందుగా గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెవివి కొండపల్లి ప్రధాన కార్యదర్శి ఎస్‌కె సర్దార్ సాహెబ్ పాల్గొన్నారు.
జగ్గయ్యపేట: మండలంలోని గంద్రాయి మెయిన్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రమేష్‌బాబు గురజాడ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతికుమారి, సుబ్బారావు, రమాదేవి, దేవదానం, ముక్తేశ్వరరావు, కృష్ణంరాజు విద్యార్థులు పాల్గొన్నారు. **తిరువూరు:** లక్ష్మీపురం ప్రాథమికోన్నత పాఠశాలలో గురజాడ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.హరికృష్ణ, ఉపాధ్యాయులు సుజాత, కుమారి, పద్మలత, శ్యామల పాల్గొన్నారు.







మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి శ్రీదేవి



మాట్లాడుతున్న రాకేష్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఎన్.వి.రావు

'గ్రీన్‌టెక్'ను తరలించాలని వినతి



వినాయక విగ్రహానికి వినతిపత్రం అందేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామ సమీపంలోని గల గ్రీన్ టెక్ ఫ్యాక్టరీలో తక్షణమే ఉత్పత్తి నిలుపుదల చేసి, డిసెంబర్ నాటికి ఫ్యాక్టరీ తరలించాలని కోరుతూ గురువారం రాత్రి గంద్రాయి రోడ్ లో గల వినాయకుడు విగ్రహానికి మహిళా సంఘం, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాలుగా గ్రీన్ టెక్ ఫ్యాక్టరీని తొలగించాలని కోరుతూ అనేక ఉద్యమాలు చేపట్టేమని, ఈ ఫ్యాక్టరీ వల్ల మూడు గ్రామాల ప్రజలు, పాఠశాల విద్యార్థులు, రైతులు, పశువుల ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే ఫ్యాక్టరీలో ఉత్పత్తి నిలుపుదల చేసి డిసెంబర్ నాటికి ఫ్యాక్టరీని తరలించి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, మహిళా సంఘం నాయకులు బి తిరపయ్య, బి వెంకన్న, మహాలక్ష్మమ్మ, నాగమణి, లక్ష్మి, మాధవి, సుహాసిని, రంబాయి, గణేష్, వంశి, ఈశ్వర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల తనిఖీ

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పురపాలక సంఘ కార్యాలయంపై వస్తున్న ఫిర్యాదుల మేరకు రీజనల్ డైరెక్టర్ సత్యనారాయణ తనిఖీలు చేపట్టారు. ఆశీల పన్ను బహిరంగం వేలంపాట నిబంధనల ప్రకారమే నిర్వహించారని తెలిపారు. దీనితో పాటు పలు రికార్డులను పరిశీలించామని అన్ని సక్రమంగా ఉన్నాయని అన్నారు.

పుస్తకాలు, బ్యాగులు పంపిణీ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం
కేతనకొండ ఎంపియుపి పాఠశాల విద్యార్థులకు ఇర్ఫాన్, పాస్టర్ ఎలీషా సౌజన్యంతో పాఠ్య పుస్తకాలు, బ్యాగులు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, నాగుల్ మీరా, కేతనకొండ గ్రామ సర్పంచ్ నళిని ఆశలత, వ్యవసాయ సహకార పరపతి సంఘ డైరెక్టర్ సయ్యద్ జానీ, కొమ్మూరి రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





రైల్వే అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

రైల్వే అండర్ పాస్‌కు దారి ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-అజిత్‌సింగ్‌నగర్: న్యూ రాజరాజేశ్వరిపేట ప్రజలకు రైల్వే అండర్ పాస్ వద్ద దారి తక్షణమే ఇవ్వాలి రైల్వే ఉన్నత అధికారికి గురువారం సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు మాట్లాడుతూ న్యూ రాజరాజేశ్వరి పేటలో సుందరమ్మ దిబ్బ, అమరావతి కాలనీ, అరుణోదయ నగర్, సుబ్బరాజు నగర్, ప్రాంత ప్రజలు రైల్వే అండర్ పాస్ దారి లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. దాదాపు మూడు వేల మంది రాకపోకలు కొనసాగిస్తున్నారని, రైల్వే ట్రాక్ పనులు పూర్తయినా దారి ఇవ్వలేదని చెప్పారు. కొన్ని రోజుల క్రితం రైల్వే డిఆర్‌ఎంకు, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిననాఇప్పటివరకు స్పందించలేదనన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారం చేయాల్సిన వైసిపి కార్పొరేటర్, సెంట్రల్ ఎమ్మెల్యే ప్రజలు ఏర్పాటు చేసుకున్న తాత్కాలికమైన దారిని కక్షగట్టి తొలగించటం సరికాదన్నారు. ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రైల్వే అండర్ పాస్ దారి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ సిటీ నాయకులు యం.బాబురావు,టి. శ్రీను, మీసాల సూర్యనారాయణ, బి.దుర్గమ్మ, లక్ష్మి,లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఇగ్నోలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో జూలై 2023 సెషన్‌కు ఆన్‌లైన్ ద్వారా పోస్ట్ గ్రాడ్యుయేట్, డిగ్రీ, పీజీ, డిప్లొమా మరియు డిప్లమా ప్రోగ్రాంలకు దరఖాస్తుల స్వీకరణ సెప్టెంబర్ 30వ తేదీ వరకూ పొడిగించినట్లు ఇగ్నో విజయవాడ ప్రాంతీయ కేంద్రం ఇన్‌చార్జ్ రీజనల్ డైరెక్టర్ కె. సుమలత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పీజీ రెండవ సంవత్సరం, డిగ్రీ రెండవ, మూడవ సంవత్సరం మరియు సెమిస్టర్ విధానంలో చదివే విద్యార్థులు కూడా రీ రిజిస్ట్రేషన్ ఫీజును ఆన్‌లైన్ ద్వారా సెప్టెంబర్ 30వ తేదీ వరకూ చెల్లించవచ్చని తెలిపారు. అలాగే డిసెంబర్ 2023లో జరిగే టర్మ్ పరీక్షలకు హాజరయ్యే డిస్టెన్స్ మరియు ఆన్‌లైన్ విద్యార్థులు పరీక్ష ఫీజును ఆన్‌లైన్ ద్వారా అక్టోబర్ 15 తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఇతర వివరాలకు విజయవాడ వన్‌టౌన్ కొత్తపేటలోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలో గల ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని స్వయంగా గాని లేదా 0866-2565253 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని తెలియజేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న డిప్యూటీ స్పీకర్

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఇంద్రకీలాద్రి దుర్గమ్మను శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి గురువారం దర్శించుకున్నారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.



మెరుగైన పౌష్టికాహారంతోనే ఆరోగ్యం : కలెక్టర్

ప్రజాశక్తి-ఉయ్యూరు : మెరుగైన పౌష్టికాహారంతోనే ఆరోగ్యం,చక్కటి విద్యాభ్యాసం సాధ్యమని కృష్ణాజిల్లా కలెక్టర్ పి. రాజాబాబు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన పథక అమలు తీరును స్వయంగా తెలుసుకునేందుకు కానూరు ఏఎస్ఎన్ఆర్ఏ జిల్లా పరిషత్ హైస్కూల్‌ను గురువారం కలెక్టర్ పి. రాజాబాబు ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు మాట్లాడుతూ గోరుముద్ద పథకం పరిశీలనలో భాగంగా రాగిజావ స్వయంగా సేవించానని అది ఎంతో రుచిగా సంతప్తికరంగా ఉందన్నారు. గోరుముద్ద పథకం కార్యక్రమాన్ని మరింతగా పటిష్టం చేసేందుకు ప్రభుత్వం గత ఆరునెలలుగా రాగిజావ సైతం పిల్లలకు అందజేస్తుందన్నారు. పిల్లలకు ఐరన్, కాల్షియం ఈ ఆహారం ద్వారా సమకూరి వారు బలంగా ఎత్తుగా పెరగడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.1 వ తరగతి నుంచి 10 తరగతి పిల్లలకు కష్ణాజిల్లాలో ప్రభుత్వం 1300 స్కూళ్ళల్లో దాదాపు లక్ష మంది పిల్లలకు పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా అందజేస్తోందన్నారు. స్కూల్ పిల్లలకు వారానికి మూడు రోజులు ఉదయం పూట రాగి జావ అందిస్తుందని తెలిపారు. గుడ్డు, చిక్కీ సహా అందిస్తున్న 15 ఆహార పదార్థాలకు ఇది అదనపు పౌష్టికాహారమని కలెక్టర్ తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారిణి తాహెరా సుల్తానా, డివైఈవో పద్మ రాణి, కానూరు జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి , పలువురు హైస్కూల్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులున్నారు.


బాలికతో కలిసి రాగిజావ తాగుతున్న కలెక్టర్ రాజాబాబు


ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక వివి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో ఇండియన్ ఫార్మాస్యూటికల్ గుడ్లవల్లేరు శాఖ, జాతీయ సేవ పథకం వారి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. లక్ష్మణరావు తెలిపారు. కళాశాల అధ్యాప కులకు, సిబ్బందికి సుమారు 50 మందికి గుండె, మూత్రపిండాలు, కళ్లెం, దంతాలు, మరియు ఎముకలకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచిత వైద్య పరీక్షలను స్థానిక లైన్స్ క్లబ్, ఆంధ్ర హాస్పిటల్, అమరావతి కంటి ఆస్పత్రి, దుహితా కంటి వైద్యశాల వారు సంయుక్తంగా నిర్వహించారు. లైన్స్ క్లబ్ పాస్ట్ డిస్టిక్ గవర్నర్ మిర్యాల వెంకటేశ్వరావు శిబిరాన్ని ప్రారంభించారు. కళాశాల సిబ్బందికి హెల్త్ కార్డు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు బొర్రా నాగేశ్వరావు కార్యదర్శి శ్రీధర్, ట్రెజరర్ పెరుమాళ్ళు, గవర్నర్ వైపిసి ప్రసాద్, క్లబ్ సభ్యులు పామర్తి కన్య భాస్కర్ రావు,పి చిట్టిబాబు, పరంధామయ్య, ఫణి గోపాల్, పిఎన్ విజయబాబు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ నిజాయితీ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం ఆర్టీసీ డిపోలోని గ్యారేజ్ సెక్యూరిటీ గేట్ వద్ద విధులు నిర్వహించిన కానిస్టేబుల్ తనకు దొరికిన పర్సును ప్రయాణికురాలికి అప్పగించిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. నైట్ ఔట్ సర్వీస్ ముగించుకుని 11 గంటలకు ఇన్కమింగ్ గ్యారేజ్ సెక్యూరిటీ గేట్ వద్ద బస్‌ను ఆన్ డ్యూటీ కానిస్టేబుల్ షేక్ రెహమాన్, చెక్ చేయగా ఒక పర్స్ దొరికింది. దానిని ఆన్ డ్యూటీ లో ఉన్న ఆర్ సి హెచ్ కి అప్పగించారు. అనంతరం బి. స్వప్న కుమారి అనే ప్రయాణీకు రాలు బస్‌లో తన పర్స్ మరిచిపోయినట్లు వచ్చి అడగడంతో ఆమె వద్ద టికెట్ పరిశీలించి లిఖితపూర్వకంగా లెటర్ రాయించుకొని పర్సు అప్పగించారు. అనంతరం ఆమె పర్స్ చెక్ చేసుకొని రూ. 7000 నగదు అంతా సక్రమం గానే ఉన్నట్లు తెలిపారు. ఆర్టీసీ కానిస్టేబుల్ నిజాయితీని డిపో మేనేజర్ శివాజీ అభినందించారు.

నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి : మేయర్

కృష్ణాప్రతినిధి : నీటి సరఫరా సక్రమంగా జరిగేందుకు చర్యలు చేపట్టాలని మచిలీపట్నం నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానికంగా పలు డివిజన్లలో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల్లు, నీటి సరఫరాను పరిశీలించారు. నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు. హెడ్ వాటర్ వర్క్స్, ఓహెచ్ ఆర్ ను పరిశీలించారు. తాగునీటి సరఫరా, క్లోరినేషన్ తీరుపై ఆరా తీశారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని చేయాలని, నీటి సరఫరాలో నిర్లక్ష్యం లేకుండా చిత్తశుద్ధితో పని చేయాలని అధికారులకు ఆదేశించారు. మేయర్ వెంట డిప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, పలువురు కార్పొరేటర్లు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలే లక్ష్యం

- బిసి సొసైటీ ఇడి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం కృష్ణాజిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం కార్య నిర్వాహక సంచాలకులు ఏ. శ్రీనివాసరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ మేనేజింగ్ డైరెక్టరు ఆదేసాను సారం గురువారం శ్రీనివాసరావు మచిలీపట్నం నగరంలోని వివిధ డివిజన్ లలో ప్రభుత్వ పథకాల మంజూరుకు దరఖాస్తు చేసుకున్న వారి వారి వివరాలను స్వయంగా పరిశీలించి లబ్దిదారుల పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ జగనన్న చేదోడు పథకము కింద షాపులున్న టైలర్స్, రజకులు, నాయీబ్రహ్మణులు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించడానికి ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించిందని కాబట్టి అర్హత ఉన్న ప్రతి ఒక్క లబ్దిదారుడుకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతోనే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందన్నారు. లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా జరపాలని, సంబంధిత వాలంటీర్స్, వెల్ఫేర్ సెక్రటరీలకు పలు సూచనలు చేశామన్నారు.


దరఖాస్తులు పరిశీలిస్తున్న దృశ్యం

మచిలీపట్నం సుందరీకరణ చేపట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లా ముఖ్యపట్టణం మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో నగర సుందరీకరణ పనులు చేపట్టి నగరం ప్రతిష్ట పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్లో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, నగరపాలక సంస్థ సిబ్బందితో సమావేశం నిర్వహించి పట్టణ సుందరీకరణకు తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుటకు అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు.నగర ప్రవేశ ద్వారాలు ఏర్పాటు తో పాటు, వివిధ ప్రాంతాల్లో సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాన రహదారులలో సెంట్రల్ లైటింగ్ సజావుగా వెలిగేలా చూడాలన్నారు. కూడళ్లను అభివద్ధి చేసి పూల మొక్కలతో అందంగా తీర్చిద్దాలన్నారు. పట్టణ పరిధిలో చూడదగిన ప్రదేశాలు టూరిజం అభివద్ధికి అవకాశం గల ప్రదేశాలు గుర్తించాలన్నారు. ముఖ్యంగా నగరంలో సాయంత్రానికి రోడ్లపై పశువుల సంచారం ఎక్కువగా ఉంటున్నదని, అట్టి పశువుల యజమానులకు నోటీసులు జారీ చేయాలని, కొంత సమయం ఇచ్చి వారి పశువులను రోడ్లపై వదల కుండా నియంత్రణలో ఉంచుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ చంద్రయ్య సహాయ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రిజర్వేషన్లపై హర్షం

ప్రజాశక్తి-గన్నవరం : దాదాపు రెండున్నర దశాబ్దాలకు పైగా డిమాండ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లు కు ఎట్టకేలకు పార్లమెంట్ ఆమోద ముద్ర వేయడం హర్షనీయమని గన్నవరం జడ్పిటిసి ఎలిజబెత్‌రాణి అన్నారు. గురువారం గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఆఫీస్‌లో వైఎస్ఆర్ మహిళ జిల్లా నాయకురాలు సురెడ్డి శ్రీమణి అధ్యక్షతన జరిగిన మహిళల కార్యక్రమంలో ఎలిజబెత్ రాణి మాట్లాడుతూ ఇప్పటికైనా మహిళ రిజర్వేషన్ బిల్లు ఆమోదింప జేయటం చాలా ఆనందంగా ఉందని అన్నారు. గన్నవరం మండల వైయస్ ఎంపీపీ సాతులూరి నగరాణి, కేసరపల్లి సర్పంచ్ చేబ్రోలు మౌనిక, వైఎస్ఆర్ మహిళ జిల్లా నయుకురాలు కురాటి అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

వివిధ క్రీడలకు బాలికలు ఎంపిక

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం బాలుర పాఠశాల క్రీడా ప్రాంగణంలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం అండర్ 14,17 బాలికలకు నియోజక వర్గ స్థాయి కబడ్డీ, ఖో ఖో, త్రో బాల్ బాడ్మింటన్, షటిల్, యోగ తదితర క్రీడాంశాలలో ఎంపికలు నిర్వహించినట్లు గన్నవరం నియోజక వర్గ క్రీడా సమన్వయ కర్త ధనియాల నాగరాజు తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణులను గుర్తించి నియోజక వర్గ జట్టుకు ఎంపిక చేసినట్లు అయన తెలిపారు. త్వరలో ఈ జట్లు జిల్లా స్థాయి ఎంపికలు జరుగుతాయ్యన్నారు.అలాగే నియోజకవర్గ స్థాయి అథెలిటిక్స్ ఈనెల 23న గన్నవరం లో జరుగుతాయని ధనియాల వివరించారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఆర్ సి పి రెడ్డి తదితరులు

మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలి

ప్రజాశక్తి - గుడివాడ : మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాల్సిందిగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌సిపి రెడ్డి డిమాండ్ చేశారు. గుడివాడ సిఐటియు కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఆర్ సి పి రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లుని ఎట్టకేలకు లోక్‌సభ ముందుకు వచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వంలో ఉన్నటువంటి మోడీ మహిళలని రెండో పౌరసత్వంగా చూస్తారు తప్ప సమాన హక్కులనేది కల్పించడం లేదన్నారు. నేటికీ మహిళల పట్ల అణిచివేత గురవుతుందని మహిళలు అన్ని రంగాల్లో ముందుండి కూడా పురుషునికి దాసోహం చేసుకున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం మహిళలని అణిచివేతకు గురి చేస్తుందని నేటి మహిళలు అందరు కూడా తెలుసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ అధ్యక్ష కార్యదర్శులు జిఎన్ఎస్ కుమారి, పి రజిని, కే రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎటు చూసినా చెత్త, వ్యర్థాలే...

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలంలోని వివిధ పంచాయతీల్లో ఎటు చూసినా చెత్తా , చెదారమే కనిపిస్తోంది. మురుగు కాల్వల్లో నీరు పారడం లేదు . దుర్గంధం వెదజల్లడంతో పాటుదోమలు ఉధృతి చెందడంతో జనాలు తీవ్ర ఇబ్బందుల కు గురవుతున్నారు. పిల్లలు అంటురోగాల భారిన పడుతున్నారు . పారిశుద్ధం అధ్వానంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. మురుగుతో నానా అగచాట్లు పడుతున్నారు. శ్రీనగర్ కాలనీ , గౌడపేట , కొత్తపేట , ముస్లిం పేట , చింతలపేట ఏరియాల్లోని డ్రైనేజీలు చెత్తతో నిండిపోయాయి. మురుగు నీరంతా రోడ్డుపైకి వస్తుందని జనాలు చెబుతున్నారు. ఇళ్లలో వాడిన నీర ంతా కాల్వలోకి వచ్చి పారకుండా నిలిచిపోతుంది. రోజుల తరబడి నిల్వ ఉండటంతో నీరం తా రంగుమాని దుర్వాసన వస్తుందని, పందులు స్వైర విహారం చేస్తున్నాయని చెప్పారు . ఆగిరపల్లి రోడ్డులో ఎక్కడపడితే అక్కడ చెత్త పారేస్తున్నారు. కొనాయి చెరువు వద్ద చెత్త పారేస్తున్నారు. ఇళ్లలోని చెత్తను రెండు రోజులకోసారి పోగేస్తున్నారు. డంపింగ్ యార్డు దూరం కావ డంతో ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. ఏదేమైనా పట్టణంలో అభివద్ధి పనులు జరగడం లేదు . కనీసం పారిశుద్ధమైనా పటిష్టం చేయడం లేదని జనాలు విమర్శిస్తున్నారు. 22 వేల జనా భా ఉన్న పట్టణంలో పారిశుద్ధంపై తగిన శ్రద్ధ పెట్టకపోవడం పట్ల అందరూ ని రసన వ్యక్తం చేస్తున్నారు. వర్షా కాలం కావడంతో చెత్త, చెదారం లేకుండా చర్యలు తీసుకోవాలని లేకుంటే రోగాలతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చెత్త సేకరించడానికి బ్యాటరీ ఆటోలను ప్రభుత్వం సరఫరా చేసింది. వాటిని వినియోగంలోకి తీసుకు రావడం లేదు . చెత్త రిక్షాలు రిపేర్లకు గురవడంతో వాటిని తొక్కడానికి సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు . కొత్తగా వచ్చిన ఆటోలను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతు న్నారు . మండలంలోని ముస్తాబాద , బుద్ధవరం పంచాయతీల్లో చెత్త సమస్యతో జ నాలు ఇబ్బందులు పడుతున్నారు . మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు . నిధులు లేకపోవడమే కారణమని చెబుతున్నారు. ఏదైమైనా ప్రభుత్వం నిధులపై ఆంక్షలు తొలగించి పారిశుధ్య పనులు చేయడానికి వీలుగా చర్య లు చేపట్టాలని జనాలు కోరుతున్నారు .



27న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు

పది వామపక్షాల రౌండ్‌టేబుల్ పిలుపు

ప్రజాశక్తి - విజయవాడ : విద్యుత్ ఛార్జీల పెంపుదలను, ప్రజా ఉద్యమాలపై నిర్బంధాన్ని నిరసిస్తూ ఈనెల 27వ తేదీన కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహించాలని పది వామపక్ష పార్టీలు నిర్ణయించాయి. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అధ్యక్షతన విజయవాడ బాలోత్సవ భవన్‌లో గురువారం వామపక్షాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. విద్యుత్ భారాలకు సంబంధించిన తొమ్మిది అంశాలతోపాటు ప్రజా ఉద్యమాలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధాన్ని ప్రతిఘటించాలని సమావేశం తీర్మానించింది. విద్యుత్ ట్రూ అప్, సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని, ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. విద్యుత్ సుంకం రద్దు చేయాలని, వడ్డీ భారాన్ని వినియోగదారులపై వేసే ప్రతిపాదనలను నియంత్రణ మండలి తిరస్కరించాలని, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు, నివాస గృహాలకు, ఇతర వినియోగదారులకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, కేంద్ర విద్యుత్ చట్ట సవరణల ప్రతిపాదనలు ఉపసంహరించుకోవాలని కోరింది. విద్యుత్ రంగ ప్రైవేటీకరణను విడనాడాలని, వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని, 200 యూనిట్లలోపు వినియోగించే పేద గృహ వినియోగదారులందరికీ ఉచితంగా విద్యుత్ ఇవ్వాలని, ఎక్కడ నివసిస్తున్నా ఎస్‌సి, ఎస్‌టిలకు, వృత్తిదారులకు, ఇతరులకు ఇస్తున్న రాయితీలను పూర్తిగా కొనసాగించాలని కోరుతూ సమావేశం తీర్మానించింది. ప్రజా ఉద్యమాలపై వైసిపి ప్రభుత్వం సాగిస్తున్న దమనకాండ,



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

నిర్బంధాలను ప్రజల మద్దతుతో ప్రతిఘటించాలని పిలుపునిచ్చింది. విద్యుత్ ఛార్జీల పెంపుదలను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేపట్టాలని చేసిన తీర్మానాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, ప్రజా ఉద్యమాలపై నిర్బంధాన్ని ప్రతిఘటించాలని చేసిన తీర్మానాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు ప్రవేశపెట్టారు. ఈ రెండు తీర్మానాల్ని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తూ వాటికి లాభాలు చేకూర్చిపెట్టే కేంద్రంలో ప్రధాని మోడీ, రాష్ట్రంలోని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అనుసరిస్తున్న విద్యుత్ ప్రైవేటీకరణకు, విద్యుత్ భారాలకు నిరసనగా ఈనెల 27న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద జరిగే ధర్నాలు, ఆందోళనలకు ప్రజలు పెద్దఎత్తున సమీకరించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ఎదురయ్యే ప్రభుత్వం నిర్బంధాన్ని సైతం ఎదుర్కోవాలని పిలుపునిచ్చింది.



గ్రంథాలయంలో గురజాడ జయంతి

ప్రజాశక్తి - విజయవాడ : సత్యనారాయణపురంలోని చిత్త రంజన్ గ్రేడ్-2 శాఖా గ్రంథాలయంలో గురువారం సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా గురజాడ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి పి.సంపత్ కుమార్ మాట్లాడుతూ 'దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్' అని ఎలుగెత్తి చాటిన తెలుగు వైతాళికులు గురజాడ అని కొనియాడారు. బాల్య వివాహాలు, కన్యాశుల్కం వంటి సాంఘిక దురాచారాలను ఎదిరించిన గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, చిన్నారులు, పాఠకులు పాల్గొన్నారు.

నేడు పర్యావరణంపై చిత్రాల ప్రదర్శన

ప్రజాశక్తి - విజయవాడ : పర్యావరణవేత్త యలవర్తి నాయుడమ్మ 101 జయంతి సందర్భంగా ఈనెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు పర్యావరణంపై బాలబాలికలు వేసిన చిత్రాల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. విజయవాడ బాలోత్సవ్ భవన్ మొదటి అంతస్తులో జరిగే ఈ ప్రదర్శనను ప్రముఖ చిత్రకారిణి ఆమ్రపాలి ప్రారంభిస్తారని, ముఖ్యఅతిథిగా స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ స్కూల్ డైరెక్టర్ స్ఫూర్తి శ్రీనివాస్ పాల్గొంటారని, 64 కళలు.కాం ఎడిటర్ కళాసాగర్ సందేశం ఇస్తారని తెలిపారు. ఈ మేరకు జాషువా సాంస్కృతిక వేదిక, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, 64 కళలు.కామ్ ప్రతినిధులు ఒక ప్రకటన విడుదల చేశారు.

23న మైలవరంలో జాబ్‌మేళా

ప్రజాశక్తి - విజయవాడ : నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో జాబ్ మేళాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీ ఉదయం 9 గంటల నుండి మైలవరంలోని లక్కిరెడ్డి హనిమిరెడ్డి గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో జరిగే ఈ జాబ్ మేళాలో పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐ.టి.ఐ, డిప్లొమా, డిగ్రీ, బి-టెక్ మరియు పోస్ట్ గ్రాడ్యుయేషన్ అర్హత కలిగిన విద్యార్థులు పాల్గొన వచ్చని తెలిపారు. bit.lyI43biYYa వెబ్ సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జాబ్ మేళాలో 20 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. జాబ్ మేళాకు హాజరైన అభ్యర్థులను కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తారని కలెక్టర్ తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు పూర్తి వివరాలకు 95027 57755/ 97000 92606/ 96033 68324 సెల్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మహాలయ అమావాస్య ప్రత్యేక పర్యాటక రైలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : 'భారత్ గౌరవ్ పథకం' కింద సేవలను అందించే ఉలా రైల్ ఏర్పాటు చేస్తున్నట్లు రైల్ పర్యాటక ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. మహాలయ అమావాస్య సందర్భంగా తమ తదుపరి పర్యటనను ప్రకటించినట్లు తెలిపారు. ప్రయాగ్ రాజ్, వారణాసి, గయ, అయోధ్య, హరిద్వార్ ఢిల్లీ, మథుర, ఆగ్రాకు అక్టోబర్ 10 నుండి 21వ తేదీ వరకు 11 రోజులు ఉంటుందని తెలిపారు. పురాతన సంప్రదాయాలు, దైవత్వం సారాంశంతో నిండిన భారతదేశం గొప్ప ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని సందర్శించడానికి ఒక ప్రత్యేక అవకాశాన్ని అందిస్తుందని తెలిపారు. ఈ ప్రత్యేక రైలు మధురై నుంచి బయలుదేరి గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, గుంటూరు, మిర్యాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్, కాజీపేట స్టేషన్ల ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. వివరాలు, టికెట్ల బుకింగ్ కోసం 7876101010ని లేదా ఆన్‌లైన్‌లో బుకింగ్‌కు www.railtourism.comని సందర్శించవచ్చని పేర్కొన్నారు.

నగరంలో స్వచ్ఛతా లీగ్ ర్యాలీలు

ప్రజాశక్తి - విజయవాడ : 'ఇండియన్ స్వచ్ఛతా లీగ్ 2.0 (ఐఎస్ఎల్ 2.0)'లో లో భాగంగా గురువారం నగర పాలక సంస్థ ఆధ్వర్యాన నగరంలోని మూడు సర్కిళ్లలో మానవహారాలు, ర్యాలీలు నిర్వహించారు. సర్కిల్-1లో 34వ డివిజన్ కార్పొరేటర్, ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బండి పుణ్యశీలతో మీసాల రాజారావు బ్రిడ్జి, ఫ్రూట్ మార్కెట్ ఏరియా వద్ద, 40వ డివిజన్ కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయ రెడ్డితో భవానీ ఘాట్ వద్ద నారాయణ కళాశాల, ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాలకు చెందిన 200 మంది విద్యార్థులు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. అలాగే సర్కిల్-2లో 58 వ డివిజన్ కార్పొరేటర్, డిప్యూటీ మేయర్ అవుతూ శ్రీ శైలజ రెడ్డి, 59వ డివిజన్ కార్పొరేటర్ మొహమ్మద్ షహీనా సుల్తానా, 36వ డివిజన్ కార్పొరేటర్ బాలి గోవిందుతో ఎంకె.బేగ్ పాఠశాల, వివేకానంద, శారద కళాశాలకు చెందిన 250 మంది విద్యార్థులు కార్యక్రమం నిర్వహించారు. సర్కిల్-3 జోనల్ కమిషనర్-3 కష్ణతో పటమట రైతు బజార్ సమీపంలోని ఇండోర్ స్టేడియం వద్ద విశ్వభారతి పాఠశాలకు చెందిన 100 మంది విద్యార్థులతో స్వచ్ఛతా హి సేవ నిర్వహించారు. అనంతరం అందరితో స్వచ్ఛత ఈ సేవ ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు, ప్రజలకు, వ్యాపారులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, హెల్త్ ఆఫీసర్ -1 సురేష్ బాబు, హెల్త్ ఆఫీసర్ -2 రామకోటేశ్వరరావు, హెల్త్ ఆఫీసర్ -3 ఇక్బాల్ హుస్సేన్, ఆయా సచివాలయాల కార్యదర్శులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

అంబేద్కర్ స్మృవనం పనుల పరిశీలన

ప్రజాశక్తి - విజయవాడ : స్వరాజ్య మైదానంలో చేపట్టిన అంబేద్కర్ స్మృతివనం నిర్మాణ పనులను గురువారం మున్సిపల్ శాఖా స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి, నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తనిఖీ చేశారు. పనుల పురోగతిపై ఆరా తీశారు. పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. మొక్కల ఏర్పాటుపై పలు సూచనలు చేశారు. స్మృతి వనంలో హరితహారం, వాటర్ ఫౌంటైన్ పనులు తుది దశలో ఉన్నాయని విఎంసి కమిషనర్ ఆమెకు వివరించారు. ఈ కార్యక్రమంలో కెపిసి ప్రాజెక్టు డైరెక్టర్ కె.అనిల్ కుమార్, మేనేజర్ కె.కష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



మొదటిపేజీ తరువాయి



షెడ్డు నిర్మాణ దృశ్యం

కార్మిక శాఖ స్థలంలో వైసిపి కార్యాలయ నిర్మాణంపై వివాదం

నిర్మాణాన్ని రామ్‌కీ సంస్థకు అప్పగించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో రామ్‌కీ సంస్థ వారు భవన నిర్మాణం కోసం షెడ్డు ఏర్పాటుకు ఉపక్రమించారు. కోట్లాది రూపాయల విలువైన రెండెకరాల కార్మిక శాఖ స్థలాన్ని వైసిపి కార్యాలయం నిర్మాణానికి కేటాయించటంపై సిపిఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు వ్యతిరేకించిన విషయం విధితమే. అదే ప్రాంతంలో సుమారు 300 గజాల స్థలాన్ని ఆక్రమించి ఓ దేవాలయ నిర్మాణం జరగటంపై కూడా పలువురు మండిపడుతున్నారు. లక్షలాది రూపాయల విలువైన భూములు ఆక్రమణలకు గురవుతుంటే నగరపాలక సంస్థ చోద్యం చూస్తోందని ప్రజలు మండిపడుతున్నారు.

'ప్రైవేటు'లోనే అధికంగా అడ్మిషన్లు

గమనార్హం.

స్టేటస్ సింబల్‌గా

ప్రభుత్వ కళాశాలల్లో కంటే ప్రైవేటు కాలేజీల్లో పిల్లలను చేర్పించడాన్ని సమాజంలో స్టేటస్ సింబల్‌గా తల్లిదండ్రులు భావిస్తున్నారని దీంతో గవర్నమెంట్ సంస్థల వైపు ఆసక్తి కనబరచడం లేదని అధికారులు చెబుతున్నారు. ప్రైవేటులో ఫీజులు చెల్లించడం కోసం అప్పులు చేయడానికి కూడా వెనుకాడటం లేదు. అయితే ప్రభుత్వం అందిస్తోన్న అమ్మ ఒడి నగదుతో తొలుత ప్రైవేటు కాలేజీల్లో చేరినా తర్వాత అక్కడి ఫీజులు భరించలేక తిరిగి ప్రభుత్వ కళాశాలలకు వస్తున్నారని, ఇటీవల ఇలా చేరుతున్న వారి సంఖ్య పెరిగిందని చెబుతున్నారు. దీంతో నేటికీ అక్కడక్కడ ప్రవేశాలు ఇంకా కొనసాగుతున్నట్లు పేర్కొంటున్నారు.

పోలింగ్ కేంద్రాలపై సమీక్ష

ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తన ఛాంబర్లో రాజకీయ పార్టీల ప్రతినిధులు, అసిస్టెంట్ ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నగరంలోని అన్ని నియోజకవర్గాల్లో ఇటీవల వరకు 1400 మంది ఓటర్లు దాటిన కేంద్రాల్లోని ఓటర్లను మరో కేంద్రానికి మార్పు చేయాలనే నిర్ణయం, నేడు జిల్లా ఎన్నికల అధికారి నిర్ణయం మేరకు 1500 ఓటర్లు దాటిన కేంద్రాలను పరిగణలోకి తీసుకోని విభజించాలనే నిర్ణయం తీసుకున్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల అభ్యర్థన మేరకు 2 కిలోమీటర్ల దూరంగా ఉన్న పోలింగ్ స్టేషన్లను, పోలింగ్ ప్రాంతానికి దగ్గరగా మార్పు చేసేందుకు ప్రస్తుత పోలింగ్ స్టేషన్ల స్థితి ఆధారంగా కొత్తగా ప్రతిపాదించేందుకు, పోలింగ్ స్టేషన్ పేర్లు మార్పు, కొత్తగా పోలింగ్ స్పేషన్ల ఏర్పాటు, ఓటర్లు 1500కి మించి ఉన్న పోలింగ్ స్టేషన్లను రెండు



చేసేందుకు ప్రతిపాదనలు పంపే విషయమై చర్చించారు. పోలింగ్ స్పేషన్ల స్థితి, భౌతిక స్థితిగతులను పరిశీలించి చెక్ లిస్ట్ ద్వారా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపే నిమిత్తం ఈ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ పార్టీల ప్రతినిధులు, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, అసిస్టెంట్ ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు పాల్కొన్నారు.

పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన విఎంసి కమిషనర్

ప్రజాశక్తి - విజయవాడ : నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ పోలింగ్ కేంద్రాలను గురువారం ఎన్నికల నమోదు అధికారి, విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. వచ్చే ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. సెంట్రల్ నియోజకవరం 23వ డివిజన్ సత్యనారాయణపురం బిఆర్‌టిఎస్ ఫుడ్‌కోర్ట్ సమీపంలోని రైల్వే కమ్యూనిటీ హాల్, 23వ డివిజన్ డిఎస్‌పి కార్యాలయం సమీపంలోని రైల్వే కమ్యూనిటి హాల్‌లోని పోలింగ్ స్టేషన్లలో మౌలిక వసతులు, ఇతర సదుపాయాలపై పలు సూచనలు చేశారు. ఓటర్లు, ఎన్నికల సిబ్బంది భద్రతపై ప్రతి పోలింగ్ స్టేషన్లో భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఓటర్లు, పోలింగ్ సిబ్బందికి అవసరమైన తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య సదుపాయాలు, సీటింగ్ ఏర్పాట్ల లభ్యతను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో మరమ్మతులు ఉంటే సంబంధిత ఏఈల దష్టికి తెచ్చి పరిష్కరించాలని ఆదేశించారు.



9వ రోజుకు రిలే దీక్షలు

ప్రజాశక్తి-గుడివాడ : స్థానిక టిడిపి కార్యాలయంలో 9వ రోజు రిలే నిరహారదీక్షలు టిడిపి రాష్ట్ర ఎస్సీసెల్ నాయకుడు కొడాలి రామరాజు అధ్వర్యంలో ఎస్సీ నాయకులు రిలే నిరహారదీక్షలు నిర్వహించారు. దీక్షలు చేస్తున్న ఎస్సీ నాయకులకు పట్టణ, రూరల్, నందివాడ మండలాల అధ్యక్షులు దింట్యాల రాంబాబు వాసే మురళీ, దానేటి సన్యాసిరావులు పూలమాలలు వేసి దీక్షలు ప్రారంభించారు. ని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు , నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు గోవాడ శివ, నాయకులు కాకర్ల సురేష్, రేమల్లె రజనీకాంత్, పులవర్తి డేవిడ్, పిల్ల సాల్మన్, దాసు శ్యాంప్రసాద్, కర్రే వెంకటగిరి, కంచర్ల సుధాకార్, మద్దాలి ఇసాక్, రామకూరి సాల్మన్‌రాజు, చత్రగడ్డ రవికుమార్, మెండు రమేష్, తేరా మార్కురాజు, దొండపాటి మహేష్, నందమూరి రాజశేఖర్, అద్దంకి మాణిక్యాలరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : రాష్ట్రంలో రౌడీయిజం పతాక స్థాయికి చేరిందని, అరెస్టులు, కేసులు, బెదిరింపులతో రాష్ట్రాన్ని రౌడీ రాజ్యంగా మార్చారని మాజీ మంత్రి టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను సైతం – బాబు కోసం కరపత్రాలను గురువారం మచిలీపట్నం స్థానిక నాగపోతురావు సెంటర్లో ప్రజలకు ,.కార్మిక సోదరులకు నారా చంద్రబాబు అరెస్టు చేసిన విధానాన్ని వివరిస్తూ డెవలప్మెంట్ ద్వారా చంద్రబాబు చేసిన అభివృద్ధిని చెబుతూ "నేను సైతం – బాబు కోసం" అనే కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్ర సూర్య బలిజ కన్వీనర్ కార్పొరేటర్ రాలకొల్లు రాము, మాజీ హాస్పిటల్ డైరెక్టర్ అబ్దుల్ అజీమ్, పివీ ఫణి కుమార్ తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మచిలీపట్నం పార్లమెంట్ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు నిమ్మగడ్డ సత్యసాయి ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన నిర్వహించారు. టిఎన్ఎస్ఎఫ్ కమిటీ సభ్యులు సురేంద్ర, నారగాని వంశీ, కాసాని శ్రీరామ్, బొర్రా ఆదిత్య, మాదాసు ప్రసాద్, కొసరాజు ఉపేంద్ర, బెజవాడ రాంబాబు, జగదీశ్, ఈడే నాగబాబు, మురాల నరేష్, నాగూర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి పెదపారుపూడి : మండలంలోని వెంట్రప్రగడ లో టిడిపి కార్యాలయం వద్ద నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మైనారిటీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'బాబుతో నేను' దీక్షలో పామర్రు నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ ఇంచార్జ్ వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి గారు, మండల పార్టీ అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి, రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు మిర్జా మాజేద్ రజా,జిల్లా మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు మహమ్మద్ దౌలా, రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి అజ్మతుల్లా బాబు, నియోజకవర్గ ఐటీడీపి అధ్యక్షులు అబ్బాస్, నియోజకవర్గ బీసీ సెల్ ప్రధాన కార్య దర్శి బొమ్మనబోయిన వెంకటనారాయణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అవనిగడ్డ : మాజీ సభాపతి మండలి బుద్ధ ప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు తొమ్మిదో రోజుకు చేరుకున్నాయి.ఈ దీక్షలను పార్టీ జిల్లా ఉపాధ్య క్షులు మండలి వెంకట్ రామ్ దీక్షలను ప్రారంభించారు. దీక్షలకు జనసేన పార్టీ నాయకులు గుడివాడ శేషుబాబు దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, పర్చూరు సుభాష్ చంద్రబోస్, కాగిత రామారావు, బండే రాఘవ, బచ్చు రఘునాథ ప్రసాద్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి కుంభా శివకష్ణ, కోడూరు మండల ఎస్సీ సెల్ అయికులు బొడ్డు వెంకన్న, కోతాడి నాగమల్లేశ్వరరావు, కుంభ కోటేశ్వరరావు పాల్గొన్నారు. కాగా సాయంత్రం మండల వెంకట్రావు నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింప చేశారు



గుడివాడలో...


అవనిగడ్డలో...


పెదపారుపూడిలో...

ఓట్ల కోసమే రాజకీయం : బేగ్

ప్రజాశక్తి – వన్‌టౌన్ : ఓట్ల కోసమే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నగరాలను బీసీలుగా గుర్తించాలని వెలంపల్లి మాట్లాడుతున్నాడని టిడిపి పశ్చిమ మైనార్టీ నాయకులు ఎంఎస్.బేగ్ విమర్శించారు. గురువారం టిడిపి పశ్చిమ నియోజకవర్గకార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బేగ్ మాట్లాడుతూ తాను రెండు పర్యాయాలు మూడు పార్టీల్లో శాసనసభ్యుడిగా, మంత్రిగా ఉన్నప్పుడు గుర్తురాని నగరాల సామాజిక వర్గం నేడు తన శాసనసభ సభ్యత్వం చివరికి వచ్చేసరికి గుర్తుకువచ్చిందని ధ్వజమెత్తారు. ఇటీవల తాను యువగళం పాదయాత్రలో నారా లోకేష్‌కి తెదేపా తరుపున సమర్పించిన నగరాలను రాష్ట్రమంతా బీసీ డీ లో చేర్చాలన్న ప్రతిపాదనను వెలంపల్లి కాపీకొట్టి దాన్ని శాసనసభలో ప్రశ్నోత్తర సమయంలో చదవడం అనేది వెలంపల్లి ఊసరవెల్లితనానికి నిదర్శనమన్నారు. ఓట్ల కోసం ఎలక్షన్ రాజకీయాలు చేయటం మానుకోవాలని అన్నారు. నగరాల మీద అంత చిత్తశుద్ధి ఉంటే వెంటనే నగరాలను అన్ని జిల్లాల్లోనూ బీసీ డీ లో చేర్చి ఈ శాసన సభ సమావేశంలోనే ఆమోదం తెలిపి, చేర్పించేలా చేయగలవా అంటూ సవాల్ విసిరారు.

పవన్‌ను విమర్శించే అర్హత లేదు

ప్రజాశక్తి – భవానీపురం : జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను విమర్శించే అర్హత వైసీపీకి కొమ్ముకాస్తున్న కాపులకు లేదని జనసేన 42వ డివిజన్ అధ్యక్షురాలు తిరుపతి అనూష విమర్శించారు. గురువారం భవానీపురంలోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కులంపేరు చెప్పి పబ్బం గడుపుకునే ప్రతి ఒక్కడు పవన్ కళ్యాణ్‌కి ఉచిత సలహా ఇచ్చేవాళ్లే అంటూ మండిపడ్డారు .ఆంధ్రప్రదేశ్ బాగు కోసం ఎంతో ప్రయత్నిస్తున్న పవన్ కళ్యాణ్‌ని ఒక కులం పేరు చెప్పి కొంతమంది పాలేరులతో ప్రెస్ మీట్లు పెట్టిస్తున్న జగన్మోహన్ రెడ్డిని త్వరలోనే ప్రజలు తరిమికొడతారన్నారు. కాపులే కాదు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పాటుపడే ప్రతి ఒక్కరూ కూడ పవన్ కళ్యాణ్‌ని అభిమానిస్తారని. మద్దతిస్తారని అన్నారు. ఆయన కష్టపడిన సొమ్మును రైతు కుటుం బాలకు, ప్రజలకు పంచిపెడుతున్నారని అన్నారు. అలాంటి వ్యక్తి గురించి కొంతమంది పనికిమాలినోళ్లు మాట్లాడితే పట్టించుకోనే పరిస్థితిలో ఎవరూ లేర న్నారు. మరొకసారి పవన్ కళ్యాణ్‌పై విమర్శలు మానుకోవాలని వైసిపి కాపు నాయకులకు అనూష హితవు పలికారు..

దాతల సహకారం మరువలేనిది

ప్రజాశక్తి-పమిడిముక్కల : దాతల సహకారంతో పాఠశాల అభివృద్ధి జరుగుతుందని వేల్పూరు గ్రామ సర్పంచ్ దిలీప్ కుమార్ అన్నారు. గురువారం పమిడిమొక్కల మండలంలోని వేల్పూరు ప్రాథమిక పాఠశాలకు దాత వి. కవిత గోడ గడియారం, విద్యార్థులకు పెన్నులు పుస్తకాలు పంపిణీ చేశారు ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వేల్పూర్ గ్రామాభి వృద్ధి కట్టుబడి ఉన్నామని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని, ఉత్తమ



విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యా యులైనవి ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు నానిబాబు, సిఆర్పి రవితేజపాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న దృశ్యం

2.0 విధానం తొలగించాలని ధర్నా

ప్రజాశక్తి-అవనిగడ్డ : రిజిస్ట్రేషన్ శాఖలో ప్రవేశపెట్టిన 2.0 విధానాన్ని తక్షణమే తొలిగించాలని అవనిగడ్డకు చెందిన డాక్యుమెంట్ రైటర్స్ ధర్నా చేశారు. గురువారం రిజిస్టర్ కార్యాలయం ఎదుట చేరుకున్న వారు రిజిస్ట్రేషన్ శాఖల ప్రవేశపెట్టిన 2.0 విధానంతో డాక్యుమెంట్ రైటర్స్ వ్యవస్థ తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా అవనిగడ్డ డాక్యుమెంట్ రైటర్స్ పెన్డౌన్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు పది లక్షల మంది ఉపాధి కోల్పోతారని తెలిపారు. డాక్యుమెంట్ రైటర్స్ అసిస్టెంట్లు కంప్యూటర్ ఆపరేటర్లు, లైఫ్ హిస్టరీ, జిరాక్స్ సెంటర్ల వారందరి పొట్ట కొట్టేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం ఉందన్నారు. తక్షణమే2.0 విధానం తొలగించి పాత విధానం కొనసాగించాలని డిమాండ్ చేశారు.

సుస్థిరాభివృద్ధిలో లక్ష్యాలు సాధించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి గురువారం వెలగపూడి సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, వైద్య ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమం, పాఠశాల విద్య, ఈక్రాప్ నమోదు, గృహ నిర్మాణం, గడపగడపకు మన ప్రభుత్వం, స్పందన గ్రీవెన్స్ , జగనన్నకు చెబుదాం అంశాలపై వివిధ జిల్లాలు సాధించిన ప్రగతి సమీక్షించారు. .జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్సో పాల్గొని జిల్లా సాధించిన ప్రగతి సిఎస్ గారికి వివరించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో 8 ప్రధాన సూచికలలోజిల్లా ప్రగతి కలెక్టర్ వివరిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో 10–19 సంవత్సరాల మధ్య వయసు కిషోర్ బాలికల్లో 34,401 మందికి ఎనీమియా పరీక్షలు, వైద్య, ఐసిడిఎస్ ద్వారా 3,352 మంది గర్భవతులకు ఎనీమియా పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. గుర్తించిన వారిలో ఎనీమియా నివారణకై ఐరన్, క్యాల్షియం, ఫోలిక్ మాత్రలు అందించడంతో పాటు, సరైన పోషకాహారం తీసుకునేలా చర్యలు తీసుకుంటు న్నట్లు తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించిన 70,464 మంది పిల్లలలో 1693 మంది ఎత్తు తక్కువ పిల్లలు, 1506 మంది బరువు తక్కువ పిల్లలను గుర్తించినట్లు, వీరికి సరైన పోషకాహారం అందించి అవసరమైన వైద్యం చికిత్స అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం కోసం కషి చేస్తున్నట్లు తెలిపారు .జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద జిల్లాలో ఏఎన్ఎంలు, ఆశాలు ఇంటింటికి వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్సో జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డిఎం అండ్ హెచ్వో డాక్టర్ జి గీతాబాయి, డీఈవో తహెరా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గ్రామ పరిశుభ్రతే ప్రథమ కర్తవ్యం : సర్పంచ్

ప్రజాశక్తి-ఘంటసాల : గ్రామ పరిశుభ్రతే పంచాయతీ ప్రథమ కర్తవ్యంగా కార్మికులు పనిచేస్తున్నారని కొడాలి సర్పంచ్ చలపాటి రాణి అన్నారు. గురువారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమ అవగాహన ర్యాలీని గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలను ఈ నెల 15వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని రహదారుల వెంబడి చెత్తా చెదారం లేకుండా, దోమల వ్యాప్తిని అరికట్టేలా గ్రామ పంచాయతీ ప్రతీ రోజు చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె వివరించారు. గ్రామాన్ని పరిశుభ్ర గ్రామంగా తీర్చిదిద్ది ప్రజలకు సేవలందిస్తున్నట్లు ఆమె వివరించారు. ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సిహెచ్. వి.ఎస్.నాగమణి, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అంతర్జాతీయ నారీ సాహిత్య భేరికి ఆహ్వానం



ప్రజాశక్తి-అవనిగడ్డ : అంతర్జా తీయ నారీ సాహిత్య భేరీలో పాల్గొనేందుకు తనకు ఆహ్వానం ఒదింది అవనిగడ్డ కు చెందిన రేపల్లె జాహ్నవి శ్రీనివాస్ తెలిపారు. అవనిగడ్డ కు చెందిన జాహ్నవి శ్రీనివాస్ వత్తిరీత్యా సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తూ ఇండోనేషి యాలోని జకర్తాలో ఐటీ కంపెనీలో సర్వీస్ డెలివరీ మేనేజర్ గా విధులు నిర్వహి స్తున్నారు. ఉద్యోగం చేస్తూనే మాతృభాష తెలుగు పట్ల ఎంతో ఆసక్తితో లహరి అని కలం పేరుతో ఎన్నో కవితలు రాశారు. పలు అంతర్జాతీయ వేదికల మీద తన కవితలను వినిపిస్తూ తెలుగు భాషాభివద్ధికి జాహ్నవి శ్రీనివాస్ చేస్తున్న కషిని గుర్తించిన ఉత్తర అమెరికా తెలుగు సంఘం ఈనెల 24వ తేదీన తానాలో జరిగి ప్రపంచ సాహిత్య వేదికలో భాగంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నారీ సాహిత్య భేరి అంతర్జాతీయ శతాధిక కవిత్రుల సమ్మేళ కార్యక్రమంలో పాల్గొనడానికి ప్రత్యేక ఆహ్వానం పలికారు. ఇటువంటి అంతర్జాతీయ కార్యక్రమంలో పాల్గొనేందుకు తనకు అవకాశం కలగడం పట్ల జాహ్నవి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు

చంద్రన గణపతిగా అలంకారం

ప్రజాశక్తి-గుడివాడ : స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవ స్థానంలో గురు వారం గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగం గా 4వ రోజు శ్రీ చంద్రన గణపతి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థాన ధర్మకర్తల కమిటీ చైర్మన్ గంటా చంద్రశేఖర్, దేవస్థాన ఇఓ ప్రసాద్, సహాయకులు శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు బంటుమిల్లి సూర్యనారాయణరావు, బొర్రా రవికుమార్, సిద్ధాబత్తుల నీలవేణి, భారతి, రాధిక, తాత రజనీకుమారి, వేదపండితులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరులోని పెద్ద ముఠా వర్కర్స్ యూనియన్ కార్యాలయం సమీపాన చింతలతోట ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో జరుగుతున్న గణేష్ మహోత్సవాలలో గురువారం ఎమ్మెల్యే కేపీ సారథి పాల్గొని పూజలు చేశారు. కంకిపాడు సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్సై వీరప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్లు రాజులపాటి రామ చంద్రరావు, అబుకలాం, కౌన్సిలర్ నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై పట్టు సాధించాలి : చక్రవర్తి



మాట్లాడుతున్న చక్రవర్తి

ప్రజాశక్తి-వన్‌టౌన్: విద్యార్థులు సైబర్ సెక్యూరిటీపై పట్టు సాధించాలని జేఎన్‌టీయు (కాకినాడ) కంప్యూటర్ సైన్సెస్ విభాగ ఆచార్యులు డాక్టర్ ఏఎస్ఎన్ చక్రవర్తి అన్నారు. కొత్తపేటలోని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సీఎస్‌సీ విభాగం ఆధ్వర్యంలో 'సైబర్ సెక్యూరిటీ ఇట్స్ ఛాలెంజెస్' అంశంపై సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులు, నూతన సాంకేతిక విప్లవం నేపథ్యంలో సైబర్ వినియోగం అధికమైందన్నారు. మొబైల్, కంప్యూటర్ వినియోగం అనివార్యమైన పరిస్థితుల్లో సమాచార భద్రత ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రజలు వారు వినియోగిస్తున్న వివిధ డిజిటల్ వస్తువుల పాస్‌వర్డ్‌ల విషయంలో అజాగ్రత్తగా ఉండటం, అందరికి అర్థమయ్యే రీతిలో వాటిని ఏర్పాటు చేసుకోవటం వలన సైబర్ నేరగాళ్లు వాటిని తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారన్నారు. అంతేకాకుండా పేలవమైన పాస్‌వర్డ్‌లను కాకుండా ఎవరూ ఊహించని రీతిలో పాస్‌వర్డ్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి పీ లక్ష్మణస్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ జే. లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రి, విభాగాధిపతులు డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ శిల్పాపద్మనాభుని తదితరులు పాల్గొన్నారు.

'వి' నూతన పథకం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ప్రముఖ టెలికాం ఆపరేటర్ సంస్థ వి తమ అధిక విలువైన పోస్టు పెయిన్ ' వి ప్రయారిటీ' ప్రారంభించినట్లు సంస్థ ఇన్‌ఛార్జి కె.రామరాజు తెలిపారు. నగరంలోని వి సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వినియోగదారుల కోసం విలక్షణమైన కస్టమర్ సేవా అనుభవాన్ని అందించడానికి వి ప్రయారిటీ నూతన పథకాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. ఎంపిక చేసిన సర్కిళ్లలో నిర్వహించిన నమూనా సేవల ఆధారంగా సేకరించిన సమాచారం ఆధారంగా ఈనూతన సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. వి ప్రయారిటీ సేవను కస్టమర్ అనుభవం, పనితీరుపై దృష్టి పెట్టడానికి రూపొందించినట్లు పేర్కొన్నారు. వి పోస్టుపెయిడ్ కస్టమర్‌లు రూ.699 అంతకంటే ఎక్కువ అధిక అద్దె ప్లాన్‌లు, నాలుగు లేదా అంతకంటే ఎక్కువ కుటుంబ ప్లాన్‌లు ఉన్నవారు ఈ సేవలను పొందవచ్చని తెలిపారు. అలాగే సీనియర్ సిటిజన్లు, పది సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం పాటు ఉన్న వి లాంగ్ టర్మ్ కస్టమర్లక కూడా వర్తించే విధంగా రూపొందించారని తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కార్పొరేటర్ ఆంజనేయరెడ్డి

ప్రజాశక్తి-భవానీపురం: పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతిఒక్కరూ తమవంతు కృషి చేయాలని 40వ డివిజన్ కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి తెలిపారు. 40వ డివిజన్ భవానీ ఘాట్ కష్ణానది పరివాహక ప్రాంతంలో 'స్వచ్ఛ హి సేవా' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆంజనేయరెడ్డి పాల్గొని నదీ పరివాహక ప్రాంతంలో విద్యార్థులు, విఎంసి అధికారులతో కలిసి పిచ్చిచెట్లు, చెత్తా చెదారం తొలగించారు. ఈ కార్యక్రమంలో విఎంసి అధికారులు కె. శివరామప్రసాద్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.



భవానీఘాట్‌లో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న ఆంజనేయరెడ్డి

పాఠశాలల్లో క్రీడా వసతులకు రూ.30 కోట్లు

- సమగ్ర శిక్షా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి
- స్కూల్ గేమ్స్ రెజ్లింగ్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న శ్రీనివాసులరెడ్డి

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ

రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో క్రీడా మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరు చేసిందని సమగ్ర శిక్షా రాష్ట్ర అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఎఎస్‌పిడి) డాక్టర్ కెవి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రస్తుతానికి 12 జిల్లాలకు క్రీడా మౌలిక సదుపాయాలు కల్పించామని, మిగిలిన 14 జిల్లాలకు త్వరలో కల్పిస్తామని చెప్పారు. విజయవాడ రూరల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎస్‌జిఎఫ్ఎపి) ఆధ్వర్యంలో 67వ అంతర్ జిల్లాల అండర్-14, 17 బాలబాలికల రెజ్లింగ్ ఛాంపియన్ షిప్ నున్నలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్‌లో గురువారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలను శ్రీనివాసుల రెడ్డి, ఎస్‌జిఎఫ్ఎపి సెక్రటరీ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్పెక్టర్ జి భానుమూర్తి రాజు, విజయవాడ రూరల్ మండల జెడ్పిటిసి సభ్యుడు కె.సువర్ణరాజు ప్రారంభించారు. పాత 13 జిల్లాల నుంచి 650 మంది రెజ్లర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యలో భాగమైన క్రీడలు, ఆటలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్రా' క్రీడోత్సవాలను నిర్వహించనుందని తెలిపారు. విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తే ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశాలు, ప్రభుత్వ శాఖల్లో ఉపాధి పొందడంలో అదనపు రిజర్వేషన్ సౌకర్యాలు లభిస్తాయన్నారు. ప్రతి విద్యార్థి కనీసం ఏదో ఒక ఆటలో పాల్గొనాలని సూచించారు. ఎస్‌జిఎఫ్ఎపి సెక్రటరీ భానుమూర్తి రాజు మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరానికి రాష్ట్రస్థాయి మొదటి ఎస్‌జిఎఫ్ క్రీడలను నున్నలో నిర్వహిస్తున్నామన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని అక్టోబర్ 3 నుంచి మధ్యప్రదేశ్‌లోని విదేశాలో జరిగే స్కూల్ గేమ్స్ రెజ్లింగ్ నేషనల్స్‌లో పాల్గొనేందుకు ఎంపిక చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నున్న జడ్‌పిహెచ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వజ్రాల భూపాల్‌రెడ్డి, విజయవాడ రూరల్ మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యార్కారెడ్డి నాగిరెడ్డి, నున్న పిఎసిఎస్ అధ్యక్షుడు పోలరెడ్డి ప్రభాకర్‌రెడ్డి , ఫిజికల్ ఎడ్యుకేషన్ రీజినల్ ఇన్స్పెక్టర్ మహబూబ్ భాషా, ఎస్‌జిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఆర్.రెడ్డి, కష్ణా జిల్లా కార్యదర్శి తోట అజయ్, వికాస్ గ్రూపు విద్యాసంస్థల కార్యదర్శి నరెడ్ల సత్యనారాయణరెడ్డి, ఎంఈవో-2 సూరిబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్ని రంగాలపై ఆసక్తి అవసరం



పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలపై ఆసక్తి పెంపొందించుకోవాలని, విద్యార్థులలో విజ్ఞానాన్ని పెంపొందించడానికి విద్యాశాఖ అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుందని వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విజయవాడ అర్బన్ డి.ఐ. రవికుమార్ అన్నారు. నగరంలోని బిషప్ అజరయ్య బాలికోన్నత పాఠశాల నందు నేషనల్ సైన్స్ సెమినార్-2023 కార్యక్రమంలో భాగంగా విజయవాడ అర్బన్, రూరల్ మండల స్థాయిలో విద్యార్థులకు పోటీలను గురువారం నిర్వహించారు. రవి కుమార్ మాట్లాడుతూ విద్యార్థులలో సైన్సు విజ్ఞానం పెంపొందించడానికి ఇటువంటి పోటీలు దోహదపడతాయని తెలిపారు. ఈ పోటీలలో అర్బన్, రూరల్ మండలాల నుండి 42 ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల నుండి విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. 'మిల్లెట్ ఎ సూపర్ ఫుడ్ ఆర్ ఎ డైట్ ఫాడ్' అనే అంశంపై పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. విజయవాడ రూరల్‌కు సంబంధించి నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని జి.సంధ్య ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 23వ తేదీ ఆంధ్రా లయోలా కళాశాలలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా సైన్స్ ఆఫీసర్ మైనం హుస్సేన్ పర్యవేక్షించగా ఎంఇవో విజయ రామారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని జయశ్రీ, న్యాయ నిర్ణేతలుగా యస్.రమేష్, బి.ప్రసాద్, మన్మధ, ప్రభాకర్ పాల్గొన్నారు.

డ్రీమ్ ఆర్ట్ కాంటెస్ట్ విజేత శృతిమనోజ్ఞ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: గ్లోబల్ టయోటా డ్రీమ్ కార్ ఆర్ట్ కాంటెస్ట్ విజేతగా వేమూరి శృతి మనోజ్ఞ నిలిచిందని సంస్థ ప్రతినిధి ఎంఎస్ఆర్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. టయోటా కిర్లోస్కర్ మోటార్ ప్రతిష్టాత్మక 16వ గ్లోబల్ టయోటా డ్రీమ్ కార్ ఆర్ట్ కాంటెస్ట్ విజేతలలో యువ కళాకారిణి శృతి మనోజ్ఞ నిలిచిందని అన్నారు. ఈ పోటీలలో టయోటా టైమ్ ట్రాన్సిటర్ పేరుతో శృతి గీసిన చిత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని అన్నారు. ఆమె సాధించిన అసాధారణ విజయానికి గుర్తింపుగా 12 నుండి 15 సంవత్సరాల వయసు విభాగంలో మూడు వేల యుఎస్ డాలర్లు గెలుచుకుందని తెలిపారు.

అమెజాన్ మల్టీ ఛానల్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

వినియోగదారులకు సత్వరమే సేవలను అందించేందుకు అమెజాన్ మల్టీ ఛానల్ ఫుల్ ఫిల్‌మెంట్‌ను ప్రారంభించినట్లు సంస్థ రీజనల్ ఇన్‌ఛార్జి కె.ఎస్.రావు ఒక ప్రకటనలో తెలిపారు. దీని ద్వారా డి2సి బ్రాండ్‌లు, తయారీదారులు, పరిశ్రమలలోని రిటైలర్‌లతో సహా విక్రేతలు తమ కార్యాకలాపాలను సులభంగా నిర్వహించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కస్టమర్ ఆర్డర్‌లను నిర్వహించానికి లాజిస్టిక్స్ సామర్థ్యాలను ఉపయోగించుకోవడం ద్వారా తమ కస్టమర్ అనుభవాన్ని మెరుగుపరచుకోవచ్చని తెలిపారు.

బిసిలకు సబ్‌కోటా అమలు చేయాలి

ప్రజాశక్తి-వన్‌టౌన్: పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మహిళ బిల్లులో బీసీలకు సబ్‌కోటా అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. గురువారం విజయవాడ నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకొని మోకాళ్లపై నిలబడి బీసీ సంక్షేమ సంఘం నాయకులు తమ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంగళరావు యాదవ్ మాట్లాడుతూ దశాబ్దాల తరబడి బీసీలు, బీసీ మహిళలు సరైన సామాజిక న్యాయానికి నోచుకోక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు యలగాల నూకాలమ్మ, నగర అధ్యక్షులు కనిశెట్టి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన

పిల్లల గుండె శస్త్రచికిత్సలు విజయవంతం

ఆంధ్ర ఆసుపత్రి డైరెక్టర్ పి.వి.రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆంధ్ర ఆసుపత్రి వైద్యులు

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: నగరంలోని ఆంధ్ర హాస్పటల్స్, హీలింగ్ లిటిల్ హార్ట్స్ యుకె ఛారిటీ సౌజన్యంతో ఇప్పటి వరకు 3,500 ఉచిత పిల్లల గుండె సర్జరీలు విజయవంతంగా నిర్వహించినట్లు హాస్పటల్ డైరెక్టర్, ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ పి.వి. రామారావు అన్నారు. సూర్యారావుపేటలోని హార్ట్ అండ్ బ్రెయిన్ హాస్పటల్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యధికంగా పిల్లల కార్డియాక్ సర్జరీలు నెలకు 50 నుండి 60 ఆపరేషన్లు చొప్పున సంవత్సరానికి 600 పిల్లల గుండె ఆపరేషన్లు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 3500 ఆపరేషన్లు, ఇంటర్వెన్షన్స్ విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఉచిత పిల్లల గుండె సర్జరీల 26వ క్యాంపు ఈనెల 17 నుండి 21వ తేదీ వరకు నిర్వహించినట్లు తెలిపారు. యుకె లివర్ పూల్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రమణ దన్నపనేని ఎనిమిది పిల్లల గుండె ఆపరేషన్లు చేశారన్నారు. అత్యంత క్లిష్టమైన గుండె జబ్బులు, ట్రాన్స్ పొసిసన్ ఆఫ్ గ్రేట్ ఆర్టరీస్, టెట్రాలజీ ఆఫ్ ఫాలో అబ్సెంట్ పల్మనరీ వాల్వ్, టెట్రాలజీ ఆఫ్ ఫాలో డబుల్ అవుట్‌లెట్, రైట్ వెంట్రికల్, సింగల్ వెంట్రికల్ ఫిజియాలజీ, ఇతర క్లిష్టతరమైన గుండె ఆపరేషన్లు నిర్వహించినట్లు తెలిపారు. రానున్న కాలంలో మూడు నెలలకు ఒకసారి శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడియాట్రిక్ కార్డియాలజిస్టు డాక్టర్ విక్రమ్, సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ శ్రీమన్నారాయణ, కార్డియాక్ అనస్టిటిస్ట్ డాక్టర్ రమేష్, పిల్లల కార్డియాక్ ఇంటెన్సివిస్ట్ డాక్టర్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.